Follow: @ANNTELUGU

ANN తెలుగు

28-05-2025

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 175 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఇందిరమ్మ ఇండ్లనిర్మాణంలో కొత్త టెక్నాలజీ

**ఇన్ ఛార్జి మంత్రులు జిల్లాల్లో పర్యటించాలి**

నకిలీ విత్తనాల విక్రేతలపై పీడీ యాక్ట్

జూన్ 3 నుండి రెవెన్యూ సదస్సులు

ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తిచేయండి


అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్

వివరాలు 2లో

**టాప్ న్యూస్**

### జూన్ 2న కవిత కొత్త పార్టీ



పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని ప్లాన్

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజునే ప్రకటన

షర్మిల తరహాలో బయటకు వచ్చేందుకు రెడీ


దెయ్యాల మధ్య కవిత పదేళ్లు ఎలా ఉన్నారు?

తండ్రీ కూతుళ్ల మధ్య మధ్యవర్తులు ఎందుకు.. అంతా డ్రామా?

బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

02


### అన్ని శాఖల్లో కమీషన్లే..



- ఏ మంత్రి ఎంత సంపాదించాలనే ఆరాటం
- మన నీళ్లను చంద్రబాబు తీసుకెళ్తుంటే సోయిలేదా?
- కేటీఆర్ క్రేజ్ పెరుగుతుందనే రేవంత్ రెడ్డి ఏడుపు
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

02

### కేటీఆర్.. ఎందుకంత నామోషీ?



- ఇప్పటికైనా అహంకారం తగ్గించుకోండి
- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో సీఎం ఫొటో ఉండొద్దా?
- ఇలాంటి వైఖరితో పార్లమెంట్ ఎన్నికల్లో మీకు జీరో
- ఇక మారకుంటే అడ్రస్ కూడా ఉండదు జాగ్రత్త
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ధ్వజం

03

# తేల్చేద్దాం

## రాహుల్.. కేసీ ఆదేశాలు

## రంగంలోకి మీనాక్షి నటరాజన్

## నేడు కీలక భేటీలు.. 30న క్లైమాక్స్


కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీపై హాట్ హాట్ గా చర్చ జరుగుతోంది. నేతలకు పదవుల పంపిణీపై హైకమాండ్ తుదిదశ క్రాస్ చెక్ కోసం మరోసారి రంగంలోకి దిగింది ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సంస్థాగత వ్యవహారాల ఇన్ ఛార్జి కేసీ వేణుగోపాల్ ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ బుధవారం కీలక భేటీలు నిర్వహించనున్నారు. అనేక వడపోతలు, అభిప్రాయ సేకరణలు, సర్వేల అనంతరం తుది జాబితా తయారు కాగా, వీటిపై మరోసారి అభిప్రాయ సేకరణ చేసేందుకు తుది కసరత్తును హైకమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గం, డీసీసీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఉత్తమ్, భట్టి, తదితర కోర్ కమిటీ సభ్యుల అభిప్రాయాలు కూడా తీసుకున్న హైకమాండ్ సామాజిక సమీకరణల నేపథ్యంలో వీటికి తుదిరూపునిస్తోంది. - మహా, హైదరాబాద్

### కేబినెట్ పై ఉత్కంఠ

మంత్రివర్గ ఖాళీల భర్తీకి సంబంధించి అనేక పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మాదిగ సామాజిక వర్గ నేతలు సమావేశమై.. హైకమాండ్ పై ఒత్తిడి పెంచారు. ఐదుగురిలో ఒకరికి ఇవ్వాలని కోరుతున్నారు. పాలమూరు నుండి వాకాటి శ్రీహరి ముదిరాజ్, ఆదిలాబాద్ నుండి వివేక్, ప్రేమ్ సాగర్ రావు, నిజామాబాద్ నుండి సుదర్శన్ రెడ్డి, మెదక్ కోటాలో విజయశాంతి, రాజగోపాల్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మైనారిటీ నుండి అమిర్ అలీ ఖాన్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. హైకమాండ్ ఎవరికి వరమిస్తుందో.. ఎవరికి కోత పెడుతుందో జాబితా వస్తే కానీ తెలీదు.




వివరాలు 3లో



### భారత్‌తో చర్చలకు సిద్ధం

- పాక్ ప్రధాని ప్రతిపాదన
- ఇరాన్ అధ్యక్షుడితో సమావేశం అనంతరం షరీఫ్ ప్రకటన
- కశ్మీర్ సహా అన్ని అంశాలపై చర్చలు జరపాలని డిమాండ్
- ఉగ్రవాదం, పీవోకేపై మాత్రమే చర్చలని స్పష్టం చేసిన భారత్

వివరాలు 2లో



మేడిగడ్డ బ్యారేజీ రిపోర్టుపై

### ఎల్ అండ్ టీ సంచలన లేఖ

- సాంకేతిక పరీక్షలు నిర్వహించకుండా బ్యారేజ్ ఫెయిలైందని ఎలా నిర్ణయించారని ప్రశ్న
- క్వాలిటీ కంట్రోల్ పాటించలేదనే ఆరోపణలపైనా కంపెనీ మండిపాటు
- బ్యారేజీ పునరుద్ధరణ గురించి ఇది వరకే ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వివరణ

వివరాలు 3లో



భారతీయ విద్యార్థులకు అమెరికా

### ఎంబసీ హెచ్చరిక

- క్లాసులకు వెళ్లకపోయినా, కాలేజీకి చెప్పకుండా కోర్సు మానేసినా వీసా రద్దు
- భవిష్యత్తులో అమెరికా వీసాలు పొందే అర్హత కోల్పోయే ప్రమాదం
- ఇటీవల 4,700 మందికి పైగా విద్యార్థుల స్టడీ పర్మిట్లు రద్దు చేసినట్లు నివేదిక
- సెవిస్ వ్యవస్థ ద్వారా విద్యార్థుల పర్యవేక్షణ
- కొన్నిసార్లు విద్యార్థులు, వర్సిటీలకు తెలియకుండానే చర్యలు

వివరాలు 2లో


# జూన్ 2న రాజీనామా?

## కవిత మరో సంచలనం

జాగృతితోనే జాగృతం.. బహుజనులకు సామాజిక న్యాయం ఎజెండా

కొత్త పార్టీ దిశగా కవిత అడుగులు

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు తారా స్థాయికి చేరగా, తెలంగాణ ఆవిర్భావ దినం రోజు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటనలకు రంగం సిద్ధం చేసుకుంటోంది, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు రావడంతో మొదలైన రాజకీయ వాయుగుండం.. జూన్ 2న తుఫాన్ గా మారే అవకాశాలున్నాయి. జూన్ 2న కొత్త పార్టీపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని జాగృతి నేతలు బయట ప్రచారం చేస్తున్నారు. ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. అయితే ఇప్పటికిపుడు పార్టీ పెట్టకున్నా.. ఆ దిశగా బలమైన సంకేతాన్ని జూన్ 2న ఇచ్చే అవకాశాలున్నాయని రాజకీయవర్గాలు చెబుతున్నాయి.



**అసంతృప్తితో ఎమ్మెల్సీ కవిత**

బీఆర్ఎస్ పార్టీలో తనకు ప్రాధాన్యత దక్కడం లేదనే అసంతృప్తితో ఎమ్మెల్సీ కవిత ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఆమె ఏ సభ, సమావేశాల్లో పాల్గొన్నా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేలా కామెంట్స్ చేస్తూ వచ్చారు. తాజాగా బీఆర్ఎస్ వరంగల్ సభ తరువాత పార్టీ తీరుపై కేసీఆర్‌కే నేరుగా లేఖ రాశారు. ఈ లేఖ లీక్ అవడంతో.. తెలంగాణ రాజకీయం షేక్ అయ్యింది. ఆ తరువాత పరిణామాలు కూడా చాలా హీట్ క్రియేట్ చేశాయి. అమెరికా నుంచి వచ్చిన కవిత.. ఎయిర్‌పోర్టులోనే మీడియాతో మాట్లాడారు.


మిగతా 2లో

### సింగరేణి జాగృతి ఆవిర్భావం

**కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ**

- టీబీజీకేఎస్ తో సమన్వయం చేసుకుంటూ పని చేస్తాం
- యువతకు ప్రాధాన్యత కల్పిస్తాం
- సింగరేణి 11 ఏరియాలకు కో ఆర్డినేటర్లను నియమించిన ఎమ్మెల్సీ కవిత
- సింగరేణి ప్రాంతంలో తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యక్రమాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతితో సింగరేణిని అంతం చేయాలని చూస్తోంది
- కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన విద్య, వైద్యం అందజేయాలి
- సింగరేణి డీఎంఎఫ్ టీ నిధులను ప్రభుత్వం కొడంగల్, మధిర నియోజకవర్గాలకు తరలించింది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

03



## టీడీపీనే ట్రెండ్ సెట్టర్

- బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించిన ఏకైక పార్టీ టీడీపీ
- కడప మహానాడు తొలిరోజు ప్రసంగంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు

**కడప, మహా :** కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలు సిసలైన అధినేతలని, పార్టీకి ప్రాణంఆయుధం కూడా కార్యకర్తలేనని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విధ్వంస పాలకులను ఎదురొడ్డి పోరాడిన కార్యకర్తల త్యాగాలు వృథా కానివ్వమని, వారికి అండగా ఉండి సంక్షేమం అందిస్తామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలనకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్ అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక ప్రాంతీయ పార్టీగా 45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి రికార్డ్ సృష్టించిన ఏకైక పార్టీ తెలుగుదేశమని అన్నారు.

మిగతా 2లో

## కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్

ఇన్వెస్టిగేషన్‌కు హాజరుకావాలని

**అధినేత డిసైడ్**

నేరుగా హాజరు అవుతానన్న కేసీఆర్

ఆన్ లైన్ ద్వారా హాజరుకావొచ్చని వారించిన న్యాయనిపుణులు

విచారణకు సంబంధించిన అంశాలపై లీగల్ టీం, ఇంజినీర్లతో చర్చ

**మహా:** కాళేశ్వరం కమిషన్ విచారణపై బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. జూన్ 5వ తేదీన పీసీ ఘోష్ విచారణ కమిషన్ ముందు హాజరవ్వాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. మంగళవారం తనతో భేటీ అయిన పార్టీలోని కొందరు సీనియర్ నేతలతో ఈ విషయాన్ని కేసీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలు

మిగతా 3లో



### హైకోర్టు జడ్జిల బదిలీ

- 11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి ప్రతిపాదన
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు
- ఏపీకి ఒకరు, తెలంగాణకు ముగ్గురు జడ్జిల బదిలీ



02

### ఢిల్లీలో సీఎం పడిగాపులు

- రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇవ్వట్లేదు
- ఖర్గే జీ.. మోదీ అభివృద్ధి కనిపించడం లేదా?
- మీకు 50 ఏళ్లలో చేయలేనిది మేము 11 ఏళ్లలో చేశాం
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు

03



# జూన్ 2న కవిత కొత్త పార్టీ

## పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని ప్లాన్

### రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజునే ప్రకటన

షర్మిల తరహాలో బయటకు వచ్చేందుకు రెడీ

దెయ్యాల మధ్య కవిత పదేళ్లు ఎలా ఉన్నారు?

తండ్రీ కూతుళ్ల మధ్య మధ్యవర్తులు ఎందుకు.. అంతా డ్రామా?

బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

**మహా:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనమైంది. ఈ లేఖపై ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతలు తమదైన శైలిలో వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. తాజాగా రఘునందన్ రావు హాట్ కామెంట్స్ చేశారు. షర్మిల అక్క పార్టీ పెట్టి పాదయాత్ర చేసినట్లు కవిత కూడా జూన్ 2న పార్టీ పెట్టే ఆలోచన ఉన్నట్లు కనిపిస్తుందని ఎంపీ జోస్యం చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పూలే విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని, ఇప్పుడు సంతకాల సేకరణ ఎందుకు చేస్తున్నారని ఆయన నిలదీశారు. కవిత లేఖ రాయడం.. కొందరు నేతలను దెయ్యాలతో పోల్చడం.. మధ్యవర్తులు చర్చలు జరపడం అంతా పొలిటికల్ డ్రామా అంటూ రఘునందన్ రావు కొట్టి పారేశారు. మంగళవారం ఆయన మెదక్ జిల్లా తూప్రాన్ చేరుకొని మాంకాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెంకటయ్యపల్లి లో పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని ప్రారంభించి మీడియాతో మాట్లాడారు.

**అంతా డ్రామా?**

కేసీఆర్, కవిత మధ్య మధ్యవర్తులు చర్చలు జరపడం అంతా డ్రామా అని రఘునందన్ రావు పేర్కొన్నారు. నిజంగానే బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉంటే కవిత 12 ఏండ్లుగా అదే పార్టీలో ఎందుకు ఉన్నారు అంటూ ప్రశ్నించారు. త్వరలో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని .. ఆ విషయం తెలిసే



కేసీఆర్ కవితతో కొత్త దుకాణం తెరిపిస్తున్నారంటూ రఘునందన్ పేర్కొన్నారు. కవిత సొంత పార్టీ పెట్టాలని ఫిక్స్ అయ్యిందన్నారు. షర్మిల తరహాలోనే కవిత కూడా పార్టీ నుంచి బయటకు వస్తుందని గతంలో తాను చెప్పానని గుర్తు చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే కవిత పార్టీ పెడుతుందని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేయడంతో.. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఏదైనా స్పష్టమైన సమాచారంతో ఆ కామెంట్స్ చేశారా లేక రాజకీయ విమర్శల్లోనే భాగమా అనేది రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ కవిత తీసుకోబోయే నిర్ణయాన్ని బట్టి అర్థమవుతుంది. కవిత బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పాలు చేయడం కోసం రంగం సిద్ధం చేసుకుంటుందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లనిర్మాణంలో కొత్త టెక్నాలజీ

## ఇన్ ఛార్జి మంత్రులు జిల్లాల్లో పర్యటించాలి

నకిలీ విత్తనాల విక్రేతలపై పీడీ యాక్ట్

జూన్ 3 నుండి రెవెన్యూ సదస్సులు

ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తిచేయండి

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా:**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఇన్‌ఛార్జ్ మంత్రులు జిల్లాల్లో పర్యటించాలని, దీనికి సంబంధించిన పూర్తి నివేదికను జూన్ 1కి అందించాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్ష చేసిన ఆయన మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు తెలంగాణలో ప్రవేశించాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందించారు. రుతుపవనాలు ముందుగా రాష్ట్రానికి రావడంతో మిగతా ధాన్యం సేకరించడం కొంత ఇబ్బందిగా మారిందని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించామని ప్రకటించారు సీఎం రేవంత్‌రెడ్డి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని ప్రకటించారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు రేవంత్‌రెడ్డి. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయన్నారు.

**కలెక్టర్లు విధుల్లో యాక్టివ్‌గా ఉండాలి..**

అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలుతోనేనని దుష్ప్రచారం చేశారని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలన్నారు. 'కలెక్టర్లు విధుల్లో యాక్టివ్‌గా ఉండాలి. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి. ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి. ఒక్క నిమిషం వృథా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోండి. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టండి.

**జిల్లాల్లో పర్యటించాలి**

నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. జిల్లాలవారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించుకోండి. భూభారతి పేద రైతులకు చుట్టం. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయండి. జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడోదశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి. ఇందిరమ్మ ఇండ్లు చాలా కీలకం. క్షేత్రస్థాయిలో బాగా జరగాలంటే అది కలెక్టర్ల చేతిలోనే ఉంది. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలి. మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలి. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలి. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటుకు రుణాలు అందించండి. క్షేత్ర స్థాయిలో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి. 29, 30 తేదీల్లో జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలి. జూన్ 1వ తేదీ నాటికి పూర్తి నివేదిక అందించాలి. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి' అని అధికారులకు సూచించారు.

# జూన్ 2న రాజీనామా?

(మొదటి పేజీ తరువాయి)

ఆ లేఖ తాను రాసిందేనని కన్ఫామ్ చేసిన ఆమె.. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ బాంబ్ పేల్చారు. ఇక కవిత లేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం స్పందించారు. కవితకు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు కేసీఆర్ దూతలను పంపినా.. తన దారి రహదారేనంటూ తేల్చిచెప్పారు

**జూన్ 2న సంచలనమే**

కవిత బీఆర్ఎస్‌ను వీడి కొత్త పార్టీ పెడతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్‌లో తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. ఇక ఆ పార్టీలో ఉండాలనుకోవడం లేదని ఆమె అనుచరులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కవిత వరుసగా పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని అంటున్నరు. ఇప్పటికే జాగృతిని విస్తరిస్తూ పలు కొత్త కమిటీలను కవిత ఏర్పాటు చేశారు. వరుసగా జాగృతి నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ కమిటీలను ప్రకటిస్తున్నారు. మంగళవారం నాడు సింగరేణి జాగృతి కమిటీని కవిత ప్రకటించారు. తొమ్మిది మంది కన్వీనర్లను నియమించారు. బహుజన సామాజిక న్యాయం ట్యాగ్ లైన్‌తో ప్రజల్లోకి వెళ్లాలని కల్వకుంట్ల కవిత భావిస్తున్నట్లు ఆమె అనుచరులు చెబుతున్నారు. అయితే కవితకు, బిఆర్ఎస్ పార్టీకి ఉన్న అనుబంధం ఒక్క ఎమ్మెల్సీ మాత్రమే. జూన్ 2న తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి.. సామాజిక న్యాయం ఎజెండా గా ముందుకు సాగాలన్న యోచనలో కవిత ఉన్నారు. సంస్థాగతంగా అన్ని స్థాయిల్లో కమిటీలను బలోపేతం చేసుకుంటూ ప్రజల్లోనే తేల్చుకోవాలని కవిత భావిస్తున్నారు. 2015 నుండే కవితకు పార్టీలో అవమానాలు ఎదురవుతున్నాయని, పదేళ్ళు ఓపికపట్టాం.. ఆరు నెలలు జైలుకు వెళ్ళాం..



ఇంకేం త్యాగం చేయాలి అంటూ కవిత మద్దతుదారులు ప్రశ్నిస్తున్నారు. పార్టీ సహకారం లేకున్నా కవిత తన మేధస్సు, శ్రమతో బతుకమ్మ, తెలంగాణ సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చి.. దానిని టీఆర్ఎస్‌కు అడ్వాంటేజ్ గా మలిచారని, కవితకు ఎపుడూ టీఆర్ఎస్ పదవుల కిరీటం పెట్టలేదన్న వాదనలు ఆ వర్గం నుండి వినబడుతున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో వాయుగుండం.. తుఫాన్ గా మారుతుందా? తేలిపోతుందా? అన్నది ముందుముందు తెలుస్తుంది.

**ప్రతిపక్షాల భవిష్యవాణి**

కవిత కొత్త పార్టీ పెడతారని.. జూన్ 2వ తేదీన కొత్త పార్టీని ఆమె ప్రకటిస్తారని ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో చీలిక ఖాయం అని, కేటీఆర్ నాయకత్వాన్ని కవిత అంగీకరించడం లేదంటున్నారు. ఈ కారణంగానే ఆమె సొంత పార్టీ పెట్టబోతున్నట్లు ప్రత్యర్థి పార్టీల నేతలు అంటున్నారు.

# భారతీయ విద్యార్థులకు అమెరికా ఎంబసీ హెచ్చరిక

క్లాసులకు వెళ్లకపోయినా, కాలేజీకి చెప్పకుండా కోర్సు మానేసినా వీసా రద్దు

భవిష్యత్తులో అమెరికా వీసాలు పొందే అర్హత కోల్పోయే ప్రమాదం

ఇటీవల 4,700 మందికి పైగా విద్యార్థుల స్టడీ పర్మిట్లు రద్దు చేసినట్లు నివేదిక

సెవిస్ వ్యవస్థ ద్వారా విద్యార్థుల పర్యవేక్షణ

కొన్నిసార్లు విద్యార్థులు, వర్సిటీలకు తెలియకుండానే చర్యలు

**మహా :** అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులతో పాటు ఇతర అంతర్జాతీయ విద్యార్థులకు అమెరికా ప్రభుత్వం కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. స్టూడెంట్ వీసా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. తరగతులకు సరిగా హాజరుకాకపోవడం, చదువుతున్న విద్యాసంస్థకు సమాచారం ఇవ్వకుండా కోర్సు నుంచి వైదొలగడం వంటి చర్యలకు పాల్పడితే విద్యార్థుల వీసాలను రద్దు చేస్తామని మంగళవారం హెచ్చరించింది. అంతేకాకుండా, అలాంటి విద్యార్థులు భవిష్యత్తులో అమెరికా వీసాలు పొందే అర్హతను కూడా కోల్పోయే ప్రమాదం ఉందని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పేర్కొంది. "మీరు చదువు మధ్యలో మానేసినా, తరగతులకు హాజరుకాకపోయినా, లేదా మీ విద్యాసంస్థకు తెలియజేయకుండా మీ స్టడీ ప్రోగ్రామ్ నుంచి నిష్క్రమించినా, మీ స్టూడెంట్ వీసా రద్దు చేయవచ్చు. భవిష్యత్తులో అమెరికా వీసాలకు మీరు అనర్హులు కావచ్చు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎల్లప్పుడూ మీ వీసా షరతులకు కట్టుబడి ఉండండి, మీ స్టూడెంట్ స్టేటస్‌ను కాపాడుకోండి" అని యూఎస్ ఎంబసీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో, అసోసియేటెడ్ ప్రెస్ నివేదిక ప్రకారం, ఇటీవల 4,700 మందికి పైగా అంతర్జా



తీయ విద్యార్థుల స్టడీ పర్మిట్లను ఎలాంటి ముందస్తు సమాచారం గానీ, సరైన వివరణ గానీ లేకుండా అమెరికా రద్దు చేసింది. అక్రమ వలసదారులు, విదేశీ జాతీయులపై కఠిన వైఖరిలో భాగంగానే ఈ చర్యలు ఉన్నట్లు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది. అమెరికాలో అంతర్జాతీయ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లను పర్యవేక్షించేందుకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్), ప్రత్యేకించి ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) ఉపయోగించే స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సెవిస్) నుంచి విద్యార్థుల రికార్డులను తొలగించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే, చాలా సందర్భాల్లో ఈ విషయం విద్యార్థులకు గానీ, వారు చదువుతున్న విశ్వవిద్యాలయాలకు గానీ తెలియడం లేదని సమాచారం. ఈ పరిణామాల దృష్ట్యా, అమెరికాలో చదువుతున్న, చదవాలనుకుంటున్న విద్యార్థులు వీసా నిబంధనల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# భారత్‌తో చర్చలకు సిద్ధం

## పాక్ ప్రధాని ప్రతిపాదన


ఇరాన్ అధ్యక్షుడితో సమావేశం అనంతరం షరీఫ్ ప్రకటన

కశ్మీర్ సహా అన్ని అంశాలపై చర్చలు జరపాలని డిమాండ్

ఉగ్రవాదం, పీవోకేపై మాత్రమే చర్చలని స్పష్టం చేసిన భారత్

**మహా :** భారత్‌తో నెలకొన్న అన్ని వివాదాలపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. కశ్మీర్, ఉగ్రవాదం, జల వివాదాలు, వాణిజ్యం వంటి కీలక విషయాలపై చర్చించి, శాంతియుత పరిష్కారం కనుగొనాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుతం నాలుగు దేశాల పర్యటనలో ఉన్న షరీఫ్, టెహ్రాన్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి, ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం ఇరు దేశాల మధ్య సరిహద్దుల్లో కాల్పులు తీవ్రమయ్యాయి. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొద్ది వారాలకే పాక్ ప్రధాని నుంచి ఈ ప్రతిపాదన రావడం గమనార్హం. "కశ్మీర్, జల వివాదాలతో పాటు అన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం. వాణిజ్యం, ఉగ్రవాద నిరోధంపై కూడా మా పొరుగు దేశంతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాం" అని షరీఫ్ పేర్కొన్నారు.

అయితే, పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) స్వాధీనంపై మాత్రమేనని భారత ప్రధాని నరేంద్ర మోదీ గతంలోనే స్పష్టం చేశారు. "ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో సాధ్యం కావు. ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి నడవవు. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు. భారత్, పాకిస్థాన్ మధ్య చర్చలంటూ జరిగితే అవి కేవలం ఉగ్రవాదం, పీఓకేపై మాత్రమే



జరుగుతాయని అంతర్జాతీయ సమాజానికి తెలియజేస్తున్నాను" అని మోదీ అన్నారు. కశ్మీర్ విషయంలో మూడో పక్షం మధ్యవర్తిత్వాన్ని కూడా భారత్ అంగీకరించబోదని, ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని తేల్చిచెప్పింది.


ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ, భారత్ యుద్ధ మార్గాన్ని ఎంచుకుంటే పాకిస్థాన్ తీవ్రంగా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు. "కొన్ని రోజుల క్రితం మేం చేసినట్లే, వారు దూకుడుగా వ్యవహరిస్తే మా భూభాగాన్ని మేం కాపాడుకుంటాం. కానీ, నా శాంతి ప్రతిపాదనను వారు అంగీకరిస్తే, మేం నిజంగా శాంతిని కోరుకుంటున్నామని, చిత్తశుద్ధితో ఉన్నామని నిరూపిస్తాం" అని ఆయన అన్నారు.

# హైకోర్టు జడ్జిల బదిలీ

## 11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి ప్రతిపాదన

సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు.. ఏపీకి ఒకరు, తెలంగాణకు ముగ్గురు జడ్జిల బదిలీ

**మహా:** పలు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. 11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి సుప్రీంకోర్టు జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం ప్రతిపాదించింది. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు బదిలీ కొలీజియం ప్రతిపాదించింది. కర్నాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుమలత, జస్టిస్ లలిత కన్నెగంటి తెలంగాణ హైకోర్టుకు బదిలీ ప్రతిపాదించింది. పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిషేక్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని, తెలంగాణ హైకోర్టు జడ్జి సుజయ్ పాల్ కల్‌కత్తా హైకోర్టుకు బదిలీ కొలీజియం సిఫారసు చేసింది. కర్నాటక హైకోర్టుకు చెందిన జస్టిస్ వీ కామేశ్వరరావు ఢిల్లీ హైకోర్టుకు, గౌహతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జమీర్ కలకత్తా హైకోర్టుకు, గౌహతి హైకోర్టుకు చెందిన జస్టిస్ మనాష్ రంజన్ పాఠక్ ఒడిశా హైకోర్టుకు, బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ నితిన్ వాసుదేయో సాంబ్రే ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రతిపాదించింది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రాకు చెందిన పంజాబ్‌హర్యానా హైకోర్టుకు, గౌహతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమన్ శ్యామ్‌ను బాంబే హైకోర్టుకు, పంజాబ్‌హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ప్రకాశ్ శర్మ రాజస్థాన్ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వివేక్ చౌదరి ఢిల్లీ హైకోర్టుకు, కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్ కుమార్ సింగ్ కర్నాటక హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ మధ్యప్రదేశ్ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓం ప్రకాశ్ శుక్లా ఢిల్లీ హైకోర్టుకు, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్ బాంబే హైకోర్టుకు, పంజాబ్‌హరియానా హైకోర్టు న్యాయమూర్తి సుధీర్ సింగ్ పట్నా హైకోర్టుకు, రాజస్థాన్ హైకోర్టుకు చెందిన జస్టిస్ అరుణ్ కుమార్‌ను ఢిల్లీ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జయంత్ బెనర్జీ కర్నాటక హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది.



# కేటీఆర్.. ఎందుకంత నామోషీ?

- ఇప్పటికైనా అహంకారం తగ్గించుకోండి
- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో సీఎం ఫొటో ఉండొద్దా?
- ఇలాంటి వైఖరితో పార్లమెంట్ ఎన్నికల్లో మీకు జీరో
- ఇక మారకుంటే అడ్రస్ కూడా ఉండదు జాగ్రత్త
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ధ్వజం



**మహా:** సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటో కచ్చితంగా పెట్టి తీరాల్సిందేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత జరిగింది. క్యాంపు ఆఫీసులో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. ప్రొటోకాల్ పాటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీల నేతల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో 371 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటో పెట్టడానికి కేటీఆర్‌కు ఎందుకంత నామోషీ ప్రశ్నించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే ఎవరు ఉంటే వారికి అధికారికంగా ప్రభుత్వ ఆఫీస్ కేటాయించిందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అహంకారం తగ్గించుకోకపోతే ఈసారి సిరిసిల్ల క్యాంపు కార్యాలయాన్ని కూడా ప్రజలు ఖాళీ చేయిస్తారని కామెంట్స్ చేశారు. ముఖ్యమంత్రి ఫొటో ఉండాలని కాంగ్రెస్ కార్యకర్తలు అడగడంలో ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు. తమ కార్యకర్తలు ప్రశ్నిస్తే సహించలేక బీఆర్ఎస్ నాయకులే దౌర్జన్యానికి దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఇంకా అధికారంలో ఉన్నామని బీఆర్ఎస్ నాయకులు కలలు కంటున్నారని విమర్శించారు. ఇలాంటి వైఖరి వల్లనే పార్లమెంట్ ఎన్నికల్లో జీరోగా మారారని, ఇక ముందు అడ్రస్ కూడా ఉండదు జాగ్రత్త అంటూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# అన్ని శాఖల్లో కమీషన్లే..

**మహా:** ప్రశ్నిస్తున్న వాళ్లకు నోటీసులు ఇప్పించి బయపెట్టాలని చూస్తున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. అవినీతి విషయంలోనే అద్భుత ప్రగతి సాధిస్తున్నదని ధ్వజమెత్తారు. అన్ని శాఖల్లో కమీషన్లే వారి ఎజెండా అని మండిపడ్డారు. ఏ మంత్రి ఎంత సంపాదించాలి, సీఎం సీటుకు ఎట్లా పోటీపడాలన్న సోయి తప్ప మరొకటి లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. అభివృద్ధిని పక్కనపెట్టి దోచుకునే విషయంలో పోటీపడుతున్నారని చెప్పారు. సూర్యాటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు మరోసారి నోటీసులు, సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి చిల్లర చేష్టలతో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని దుయ్యబట్టారు. అందాల పోటీలతో ప్రపంచం ముందు తెలంగాణ పరువు తీశారని, కేటీఆర్‌కు నోటీసులిస్తే బయపడతామనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. ప్రపంచ వ్యాప్తంగా కేటీఆర్ క్రేజ్ పెరుగుతుం



దని రేవంత్ ఏడుస్తున్నదన్నారు. నేషనల్ హెరాల్డ్ చార్జిషీట్‌లో రేవంత్ పేరును ఈడీ పేర్కొన్నప్పటికీ.. మోదీని కలవడానికి వెళ్లాడంటేనే ఆయన బుద్ధి అర్థమవుతుందన్నారు. దీనిని బట్టి రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ దోస్తీ ఎట్లుందో తెలుస్తుందన్నారు. ఆ నాడు కేటీఆర్ స్వయంగా 8 గంటలు కూర్చుని చెప్పిన విషయం మీకు గుర్తుకులేదా అంటూ ప్రశ్నించారు. నోటీసులతో చిల్లర డ్రామాలు చేస్తూ మరింత నవ్వుల పాలవుతున్నారని, చిల్లర రాజకీయాలతో బీఆర్ఎస్ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయలేరని కామెంట్స్ చేశారు. మన నీళ్లను చంద్రబాబు తీసుకెళ్తుంటే సోయిలేదని, చిల్లర చేష్టలు మానుకొని ఇకనైనా అభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిదంటూ జగదీశ్ రెడ్డి కోరారు.

# తేల్చేద్దాం

## రాహుల్.. కేసీ ఆదేశాలు

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీపై హాట్ హాట్ గా చర్చ జరుగుతోంది. నేతలకు పదవుల పంపిణీపై హైకమాండ్ తుదిదశ క్రాస్ చెక్ కోసం మరోసారి రంగంలోకి దిగింది ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సంస్థాగత వ్యవహారాల ఇన్ ఛార్జి కేసీ వేణుగోపాల్ ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ బుధవారం కీలక భేటీలు నిర్వహించనున్నారు. అనేక వడపోతలు, అభిప్రాయ సేకరణలు, సర్వేల అనంతరం తుది జాబితా తయారు కాగా, వీటిపై మరోసారి అభిప్రాయ సేకరణ చేసేందుకు తుది కసరత్తును హైకమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గం, డీసీసీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఉత్తమ్, భట్టి, తదితర కోర్ కమిటీ సభ్యుల అభిప్రాయాలు కూడా తీసుకున్న హైకమాండ్ సామాజిక సమీకరణల నేపథ్యంలో వీటికి తుదిరూపునిస్తోంది. ఈనెల 30న జాబితా పై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆమోదముద్ర వేయనుండగా, 31న లేదా 1న ప్రకటన రానుంది. జూన్ 2న కొత్త మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లపై పీఠముడి**

ప్రధానంగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లపై కసరత్తు మార్పుచేర్పులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, రెడ్డి సామాజికవర్గాల్లో పేర్లపై హైకమాండ్ పలు సూచనలు చేయగా, వాటికి అనుగుణంగా మళ్ళీ కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రోహిణ్ రెడ్డి, వంశీచంద్ రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తుండగా, తాజాగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పేరు కూడా తెరపైకి వచ్చింది. మైనారిటీలకు సంబంధించి ఫహీం ఖురేషీ, ఫిరోజ్ ఖాన్ , అజ్మతుల్లా పేర్లు వినిపించగా, ఇపుడు షబ్బీర్ అలీ పేరు కూడా తెరపైకి వచ్చింది.

### కేబినెట్ పై ఉత్కంఠ

మంత్రివర్గ ఖాళీల భర్తీకి సంబంధించి అనేక పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మాదిగ సామాజిక వర్గ నేతలు సమావేశమై.. హైకమాండ్ పై ఒత్తిడి పెంచారు. ఐదుగురిలో ఒకరికి ఇవ్వాలని కోరుతున్నారు. పాలమూరు నుండి వాకాటి శ్రీహరి ముదిరాజ్, ఆదిలాబాద్ నుండి వివేక్, ప్రేమ్ సాగర్ రావు, నిజామాబాద్ నుండి సుదర్శన్ రెడ్డి, మెదక్ కోటాలో విజయశాంతి, రాజగోపాల్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మైనారిటీ నుండి అమిర్ అలీ ఖాన్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. హైకమాండ్ ఎవరికి వరమిస్తుందో.. ఎవరికి కోత పెడుతుందో జాబితా వస్తే కానీ తెలీదు.



# సింగరేణి జాగృతి ఆవిర్భావం

## కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ

టీబీజీకేఎస్ తో సమన్వయం చేసుకుంటూ పని చేస్తాం.. యువతకు ప్రాధాన్యత కల్పిస్తాం

సింగరేణి 11 ఏరియాలకు కో ఆర్డినేటర్లను నియమించిన ఎమ్మెల్సీ కవిత

సింగరేణి ప్రాంతంలో తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యక్రమాలు

కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతితో సింగరేణిని అంతం చేయాలని చూస్తోంది

కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన విద్య, వైద్యం అందజేయాలి

సింగరేణి డీఎంఎఫ్ టీ నిధులను ప్రభుత్వం కొడంగల్, మధిర నియోజకరవర్గాలకు తరలించింది

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**మహా :** సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సింగరేణి జాగృతి ఆవిర్భావ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సింగరేణిలోని 11 ఏరియాల కార్మికులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీబీజీకేఎస్ తో సమన్వయం చేసుకుంటూ సింగరేణి జాగృతి పని చేస్తుందన్నారు. సింగరేణి కార్మికులు విద్య, వైద్యం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతితో సింగరేణి సంస్థనే అంతం చేయాలని కుట్రలు పన్నుతోందని వాటిని అడ్డుకుంటామన్నారు. సంస్థలో 40 వేల మందికిపైగా కార్మికులు పని చేస్తుంటే వారిలో సగానికిపైగా యువకులే ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా 11 ఏరియాలకు సింగరేణి జాగృతి కో ఆర్డినేటర్లను నియమిస్తున్నామని కవిత ప్రకటించారు. సింగరేణి స్కూళ్లను పునరుద్ధరించి సీబీఎస్ఈ సిలబస్ లో విద్యాబోధన చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ హాస్పిటళ్లలో ఉచిత వైద్యం అందజేయాలన్నారు. కార్మిక కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించాలని, తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 1970లో నిర్మించిన క్వార్టర్స్ కూలిపోయే దశలో ఉన్నాయని, అన్ని రీజియన్లలో కార్మికుల కోసం కొత్త క్వార్టర్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్టుల్లో ఎస్ డీఎల్ వెహికిల్స్ ను సింగరేణి కార్మికులతోనే నడిపించాల్సి ఉండగా ఆ మిషన్లను ప్రైవేటు వాళ్ల తో నడిపిస్తున్నారని, ఇది ఓపెన్ కాస్టుల నుంచి కార్మికులను తొలగించే కుట్ర అన్నారు. వెంటనే ప్రైవేట్ వ్యక్తులతో పని చేయించడం ఆపివేయాలన్నారు. సింగరేణి సంస్థ ద్వారా సమకూరుతున్న డీఎంఎఫ్ టీ నిధులను కార్మికులకు మెరుగైన వసతులు కల్పించడానికి వినియోగించుకుండా సీఎం, డిప్యూటీ సీఎంల నియోజకవర్గాలు కొడంగల్, మధిరకు తరలించుకుపోతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి సింగరేణిని రక్షించుకున్నామని, అలాంటి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తమ అవినీతితో అంతం చేయాలని చూస్తోందన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్ సెకండ్ ఫేజ్ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.5 వేల కోట్లతో ప్రతిపాదిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే రూ.9 వేల కోట్లకు పెంచిందని అంటే సంస్థను తమ అవినీతితో ఈ ప్రభుత్వం ఏ స్థాయిలో దెబ్బతీయాలని చూస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎక్స్ ప్లోజివ్స్ టెండర్లలోనూ భారీ అక్రమాలకు పాల్పడ్డారని, ఏకంగా టెండర్ ను మూడు రెట్లు పెంచారని తెలిపారు. 130 ఏళ్ల సింగరేణి చరిత్రలోనే ఇంతటి అవినీతిని ఎప్పుడూ చూడలేదన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని సంస్థను ముంచేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకొని తీరుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీ కోసం పని చేస్తున్నాడని అందుకే కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీసే లేబర్ కోడ్ గురించి ఒక్కమాట మాట్లాడటం లేదన్నారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతామన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగ నియామకాలు జీఎం స్థాయిలో చేస్తారని.. సీఎం తన పబ్లిసిటీ స్టంట్ కోసం ఉద్యోగులను ఇబ్బంది పెడుతూ హైదరాబాద్ కు పిలిపించి అపాయింట్ మెంట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. పెండింగ్ లో ఉన్న మారు పేర్ల సమస్యను పరిష్కరించి వారికి ఉద్యోగ అవకాశం వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారి తరుపున సింగరేణి జాగృతి ఉద్యమిస్తుందన్నారు. రాజకీయ పార్టీలకు సింగరేణి అంటే తమ ప్రయోజనాలు మాత్రమేనని.. కార్మికులకు ఆ సంస్థే జీవితమని అన్నారు. వారందరి తరుపున తాము పని చేస్తామన్నారు. కార్మికుల కోసం తాను స్వయంగా బొగ్గు గనులు, ఓపెన్ కాస్టుల వరకు వచ్చి కూర్చొంటానని హామీ ఇచ్చారు. ఓపెన్ కాస్టుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సింగరేణి జాగృతికి అనుబంధంగా మహిళల విభాగం కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

**జాగృతి ఏరియా కో ఆర్డినేటర్ల నియామకం**

1) బెల్లంపల్లి - కిరణ్ ఓరం
2) శ్రీరాంపూర్ - కుర్మ వికాస్
3) మందమర్రి - ఎస్. భువన్
4) రామగుండం 1 - బొగ్గుల సాయికృష్ణ
5) రామగుండం 2 - కె. రత్నాకర్ రెడ్డి
6) రామగుండం 3 - దాసరి మల్లేశ్
7) భూపాలపల్లి - నరేశ్ నేత
8) మణుగూరు - అజ్మీరా అశోక్ కుమార్
9) కొత్తగూడెం - వన్నంరెడ్డి వీర నాగేంద్ర సాగర్
10) కార్పొరేట్ - వసికర్ల కిరణ్ కుమార్
11) ఎస్ టీపీపీ పవర్ ప్లాంట్ - కె. రామ్మోహన్ చారి


### మేడిగడ్డ బ్యారేజీ రిపోర్టుపై

# ఎల్ అండ్ టీ సంచలన లేఖ

సాంకేతిక పరీక్షలు నిర్వహించకుండా బ్యారేజ్ ఫెయిలైందని ఎలా నిర్ణయించారని ప్రశ్న

క్వాలిటీ కంట్రోల్ పాటించలేదనే ఆరోపణలపైనా కంపెనీ మండిపాటు

బ్యారేజీ పునరుద్ధరణ గురించి ఇది వరకే ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వివరణ



**మహా :** మేడిగడ్డ బ్యారేజీ ఫెయిలైందంటూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్ డీఎస్ఏ) ఇచ్చిన నివేదికపై నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ మండిపడింది. బ్యారేజీ నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ పాటించలేదనే ఆరోపణలను తోసిపుచ్చింది. ఎలాంటి సాంకేతిక పరీక్షలు నిర్వహించకుండా బ్యారేజ్ ఫెయిలైందని ఎలా నిర్ణయించారని ప్రశ్నించింది. ఈ మేరకు తాజాగా ఎల్ అండ్ టీ ఓ లేఖ రాసింది. మేడిగడ్డ బ్యారేజీపై ఎన్ డీఎస్ఏ ఇచ్చిన నివేదికను పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు తేల్చిచెప్పింది. మేడిగడ్డ బ్యారేజీపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కీలక రిపోర్టును ఇటీవలే తెలంగాణ ప్రభుత్వానికి అందజేసింది. దీనిపై తాజాగా ఎల్ అండ్ టీ స్పందిస్తూ లేఖ రాసింది. ఎన్ డీఎస్ఏ నివేదికలోని ఎగ్జిక్యూటివ్ సమ్మరీ ప్రకారం బ్యారేజీ పనితీరును, దెబ్బతినడానికి కారణాన్ని తెలుసుకోవాలంటే తగిన సాంకేతిక పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అయితే, మేడిగడ్డ బ్యారేజీకి ఎలాంటి సాంకేతిక పరీక్షలు నిర్వహించలేదు. గ్రౌటింగ్ కారణంగా పరీక్షలు చేయలేదని ఎన్ డీఎస్ఏ నివేదికలో పలుచోట్ల స్పష్టం చేసింది. అలాంటపుడు బ్యారేజీ ఫెయిలైందని ఎలా నిర్ణయించారని ఎల్ అండ్ టీ ప్రశ్నించింది. ఏ ప్రాతిపదికన బ్యారేజీ విఫలమైందని నివేదిక ఇచ్చారని నిలదీసింది. నివేదికలోని 283వ పేజీలో క్వాలిటీ కంట్రోల్ కు సంబంధించిన నివేదికను ఎల్ అండ్ టీ సమర్పించిందని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది. అయితే, అదే నివేదికలో పలు చోట్ల క్వాలిటీ కంట్రోల్ పాటించలేదని ప్రస్తావించడం అసంబద్ధమని అన్నారు. బ్యారేజీ పునరుద్ధరణ గురించి ఇదివరకే ఒకసారి ఎన్ డీఎస్ఏతో పాటు రాష్ట్ర నీటి పారుదుల శాఖకు లేఖలు రాసినట్లు గుర్తు చేసింది.

## కగార్ ఆపరేషన్ పై న్యాయ విచారణ జరుపాలి

ఎన్ కౌంటర్ లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి

బూటకపు ఎన్ కౌంటర్ వల్లే శవాలను ఇచ్చేందుకూ భయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**మహా :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్ పై న్యాయ విచారణ జరుపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా సీపీఐ మహాసభల రెండవ రోజు హసన్ పర్తి మండల కేంద్రంలో జరిగిన ప్రతినిధుల సభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కేంద్రం చేసిన బూటకపు ఎన్ కౌంటర్ లపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని కోరారు. చత్తీస్ ఘడ్ లో జరిగింది బూటకపు ఎన్ కౌంటర్ అయినందు వల్లనే నక్సల్ శవాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు భయపడుతున్నారని విమర్శించారు. ఈ దేశ పౌరులను చంపిన టెర్రరిస్టులను పట్టుకోవడంలో బీజేపీ ప్రభుత్వం విఫలం అయిందని, అందుకే దేశ పౌరులైన మావోయిస్టులను చంపి ప్రధాని నరేంద్ర మోడీ సంబురాలు చేసుకుంటున్నారన్నారు. దేశ పౌరులను చంపిన టెర్రరిస్టులతో చర్చలకు సిద్ధపడిన కేంద్రం ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరిపేందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. టెర్రరిస్టులకంటే మోడీకి కమ్యూనిస్టులంటేనే భయమని, అందుకు ఎన్ కౌంటర్ ల తరువాత శవాలను ఇచ్చేందుకూ భయపడుతున్నాడన్నారు. ఇటీవల కాలంలో వందల మంది మావోయిస్టులను చంపివేశారని, కమ్యూనిస్టులను తుడిచి పారేస్తామని మోడీ, అమిత్ షా ప్రగల్భాలు పలుకుతున్నారని, అలాంటి వారందరికి హిట్లర్, ముస్సోలినీ గతే పడుతుందని హెచ్చరించారు. దేశంలో అన్ని ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలని, అందరూ ఏకమైతే ఎదుర్కొనే శక్తి బూర్జువా పార్టీలకు ఉండదని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీతో జత కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తున్నదని, అది కేసిఆర్ కు కవిత రాసిన లేఖతో స్పష్టమైందని అన్నారు. దేశంలో అంబానీ, ఆదానీలకు ఊడిగం చేసే మోడీతో జతకట్టేందుకు సిద్ధపడుతావా కేసిఆర్ అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, కమ్యూనిస్టులను బతికించుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందన్నారు. ఎన్నో పార్టీలు పుట్టి కనుమరుగు అయ్యాయని, ప్రజాప్రయోజనాలకే నిలబడి ఉండడం వల్లనే అధికారం లేకున్నా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పాటు నిలబడిందని అన్నారు. సీపీఐ ఆవిర్భవించి ఈ ఏడాది డిసెంబర్ 25 నాటికి వందేళ్లు కావస్తుందని, వందేళ్ల ముగింపు బహిరంగ సభను ఖమ్మంలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఢిల్లీలో సీఎం పడిగాపులు

## రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇవ్వట్లేదు

ఖర్గే జీ.. మోదీ అభివృద్ధి కనిపించడం లేదా?

మీకు 50 ఏళ్లలో చేయలేనిది మేము 11 ఏళ్లలో చేశాం

బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు



**మహా:** నరేంద్ర మోదీ పదకొండు ఏళ్ల పాలనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే విషం చిమ్ముతున్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మోదీ తన పాలనలో చేసిన అభివృద్ధి మీకు కనిపించడం లేదా ఖర్గే జీ అంటూ ప్రశ్నించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో పదవ స్థానంలో ఉన్న భారత్‌ను మోదీ నాలుగవ ఆర్థిక శక్తిగా ఎదిగేలా చేశారన్నారు. మోదీ విధానాలు, కులం, వస్త్రాలపై రాహుల్ గాంధీ అవహేళన చేశారని విమర్శించారు. స్టాండప్, స్టార్టప్, మేక్ ఇన్ ఇండియాగా మోదీ తీర్చిదిద్దారని, ఉద్యోగాలు ఇవ్వడమే కాదు.. ఉద్యోగాలు కల్పించే వ్యవస్థలుగా యువతను తీర్చిదిద్దారన్నారు. జాతీయ రహదారులు, రైల్వే, వైమానిక రంగాలను అభివృద్ధి చేశారని తెలిపారు. కాంగ్రెస్ పాలన కన్నా వంద రెట్ల అభివృద్ధి మోదీ చేసి చూపించారని, నకిలీ విత్తనాలు అరికట్టి, కనీస మద్దతు ధరలు, సబ్సిడీలు మోదీ ప్రభుత్వం కల్పించింది.. ఇది అచ్చేదిన్ కాదా ఖర్గే చెప్పాలన్నారు. ఓబీసీలపైన రాహుల్ గాంధీ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో మోదీ తరహాలో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పారా? అంటూ ప్రశ్నించారు.

**ఎమర్జెన్సీని తెచ్చింది..**

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ దేశ రక్షణ రంగ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందని, మల్లిఖార్జున్ ఖర్గే వాస్తవాలు గ్రహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో మూడు రోజులు పడిగాపులు కాశారన్నారు. రాహుల్ గాంధీ ముఖ్యమంత్రికి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే అంటూ వ్యాఖ్యానించారు. కుటుంబ కలహాలు, ఆస్తుల పంపకాలు, వారసత్వ రాజకీయాల వల్లే బీఆర్ఎస్‌లో కొట్లాట అని చెప్పారు. బీజేపీ వెన్నుపోటు రాజకీయాలు చేయదని, ఆయుదాలు చేతిలో పట్టుకొని చర్చలు అంటే ఎట్లా?, ఆపరేషన్ సిందూర్‌ను విమర్శిస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఈటల రాజేందర్ నోటీసులకు సమాధానం ఇస్తారని చెప్పుకొచ్చారు. మల్లికార్జున ఖర్గే 11 ఏళ్ల మోదీ పాలనను పీడకలగా చెప్పడం సరికాదని అన్నారు. ఎమర్జెన్సీని తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అది ఓ పీడకల అని విమర్శించారు. ఓబీసీ రిజర్వేషన్‌ను అడుగు అడుగునా అడ్డుకుంది ప్రతిపక్షనేత రాహుల్ గాంధీనే అని విమర్శించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో చేయలేనిది మోదీ 11 ఏళ్లలో చేశారని అన్నారు.

# కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందనే ఆరోపణలపై రేవంత్ సర్కార్ జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిషన్ నియమించింది. ఆరోపణలపై కమిషన్ గడచిన ఏడాదిలో 110 మందిని విచారించిన తర్వాత కేసీఆర్‌తో పాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్ రావుకు కూడా నోటీసులు జారీ చేసింది. జూన్ 5వ తేదీన కమిషన్ ముందు విచారణకు రావాలని నోటీసులో స్పష్టం చేసింది. విచారణకు కేసీఆర్ హాజరవుతారా లేదా అన్న విషయం ఇన్నిరోజులు సస్పెన్స్ గా ఉండిపోయింది. అలాంటిది తనను కలసిన నేతలతో మాట్లాడినపుడు విచారణకు హాజరవుతున్నట్లు కేసీఆర్ చెప్పారు. కేసీఆర్ నేరుగా హాజరుకావడానికి సిద్ధంగా ఉండగా, ఆన్ లైన్ ద్వారా విచారణకు హాజరుకావొచ్చని న్యాయనిపుణులు సూచించినట్లు తెలిసింది. నేరుగా కమిషన్ ముందుకు వెళ్ళొద్దని వారించినట్లు తెలిసింది. అయితే కేసీఆర్ తర్వాత 6వ తేదీన హరీశ్ రావు కూడా విచారణకు హాజరవ్వటం ఖాయమైపోయింది. కేసీఆర్ వర్చువల్ గా, హరీష్ రావు నేరుగా విచారణకు హాజరయ్యే అవకాశాలున్నాయి.

**ఏడుసార్లు పొడిగింపు**

తెలంగాణలోని కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో అవకతవకలపై గత కొన్ని నెలల నుంచి జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ విచారణ జరుపుతోంది. గతేడాది మార్చి 13న రేవంత్ ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. కమిషన్ ఏర్పాటు చేసిన ఇప్పటికి 14 నెలలు పూర్తి కావచ్చింది. ఏడుసార్లు కమిషన్ గడువు పొడిగించింది ప్రభుత్వం. కేసీఆర్, హరీశ రావు, ఈటల రాజేందర్‌కు మే 20న నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. కేసీఆర్ జూన్ ఐదులోగా విచారణకు రావాలని ఆ నోటీసుల్లో ప్రస్తావించింది.


**ప్రశ్నల గురించి దృష్టి**

అటు బీఆర్ఎస్ రజతోత్సవ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కోసం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు యూకే, అమెరికా పర్యటనకు వెళ్లారు. వచ్చే 5వ తేదీన విచారణకు హాజరు కావాలని కేసీఆర్‌కు కమిషన్ నోటీసుల నేపథ్యంలో ఆలోగా తిరిగి స్వదేశానికి చేరుకోనున్నారు. కేసీఆర్ విచారణకు హాజరైనా? లేకపోయినా అందుబాటులో ఉండేందుకు వీలుగా కేటీఆర్ నాలుగో తేదీన హైదరాబాద్ చేరుకుంటారని పార్టీ నేతలు చెప్తున్నారు. విశ్రాంత ఇంజినీర్లు, న్యాయవాదులతో సమావేశమవుతున్న కేసీఆర్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణకు సంబంధించిన అన్ని అంశాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అఫిడవిట్లు, నివేదికలు, ఇతర డాక్యుమెంట్ల ఆధారంగా విచారణ చేస్తున్నందున అందులోని అంశాలు క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా అడుగుతున్న ప్రశ్నల గురించి దృష్టి సారించినట్లు తెలిసింది.



## ప్రపంచానికి 'సిందూర్' ప్రాముఖ్యత తెలిసింది

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**మహా :** 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారతీయ మహిళల నుదుటిన వెలిగే సిందూరం యొక్క ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేశామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఆపరేషన్ దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిందని అన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించి, దేశం గర్వపడేలా చేశామని, ఇది కేవలం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం వల్లే సాధ్యమైందని ఆయన కొనియాడారు. దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూసిన శక్తులను వెనక్కి తరిమికొట్టామని, ఇప్పుడు వారు తమ చర్యలకు పశ్చాత్తాపంతో బాధపడుతున్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ దృఢ సంకల్పం, నిఘా వర్గాల కచ్చితమైన సమాచారం, త్రివిధ దళాల అద్భుతమైన సమన్వయం వల్లే 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని ఆయన గతంలోనూ పలుమార్లు స్పష్టం చేశారు.





# టీడీపీనే ట్రెండ్ సెట్టర్

(మొదటిపేజీ తరువాయి)

1982లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం మొదలు... నిన్నటి విధ్వంస పాలన వరకూ రాజీలేని పోరాటంచేశామన్నారు. మంగళవారం కడపలో జరిగిన మహానాడు తొలిరోజు సమావేశంలో ప్రారంభోపన్యాసాన్ని జై తెలుగుదేశం, జోహార్ ఎన్టీఆర్ నినాదాలతోముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుపెట్టారు. అంతకుముందు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, జ్యోతిని వెలిగించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి ఉద్వేగంగా ప్రసంగించారు.

**ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది**

ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడు అంటే అదే జోరు. అదే హోరు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే నా మనసు ఉప్పొంగుతోంది. నాకు ప్రాణసమానమైన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులందరికీ స్వాగతం. దేశంలో అనేక రాజకీయ పార్టీలున్నాయి. మహానాడులా వేలాదిమంది ప్రతినిధులతో మంచిచెడులు, విధానాలు, ఆలోచనలు చర్చించుకునే ఏకైక పార్టీ మాత్రం తెలుగుదేశమే. రాయలసీమలో మహానాడు అంటే తిరుపతిగా ఉండేది. తొలిసారి దేవుని కడపలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి మహానాడు కడపలో ఏర్పాటు చేశాం. కడప గడ్డపై ఈ మహానాడు చూస్తుంటే ఎన్నికలు అయ్యి ఏడాదైనా కార్యకర్తల్లో ఆకసి, ఉత్సాహం, ఉద్వేగం ఏమాత్రం తగ్గలేదు. ఉమ్మడి కడపలో 10 కి ఏడుస్థానాలు గెలిచి సత్తాచాటాం. ఈసారి మరింత కష్టపడితే 10కి 10 మనవే.ఇప్పటి వరకూ మనం 34 మహానాడులు జరుపుకున్నాం. ఈ మహానాడు సువర్ణాక్షరాలతో చరిత్ర సృష్టించబోతోంది. ఏపీ ఆర్థిక పరిస్థితికి దశ దిశ నిర్దేశిస్తుంది. గతంలో మహానాడు అంటే ఎండలు మండేవి. ఈసారి చల్లటి వాతావరణంలో మహానాడు జరుగుతోంది.

**కార్యకర్తల పోరాట ఫలితమే ఈ అద్భుత విజయం**

2024 ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయం అసామాన్యం. 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో చరిత్ర సృష్టించామంటే అందుకు పసుపు సైనికుల పోరాటం, త్యాగాలే కారణం. జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేయడం ఈ మహా విజయానికి దోహదం చేసింది. ఏమీ ఆశించకుండా దశాబ్ధాలుగా గ్రామాల్లో జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే ఇక్కడ ఉన్నాం. దీన్ని ప్రతి నేత కూడా గుర్తుంచుకోవాలి. 43 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలు ఎదుర్కొన్నాం. పార్టీ పని అయిపోయిందని మాట్లాడినవారి పనే అయిపోయింది కానీ టీడీపీ జెండా రెపరెపలాడుతూనే ఉంది. నాటి ఎన్టీఆర్ చైతన్య రథం, నేను చేసిన వస్తున్నా మీకోసం పాదయాత్ర, లోకేష్ యువగళం వరకూ కార్యకర్తల్లో అదే స్ఫూర్తి.

**గొంతు కోసినా జై తెలుగు దేశం అన్నారు**

పాలన అంటే హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులు, వేధింపులు, తప్పుడు కేసులుగా గత పాలకులు మార్చారు. విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. దీన్ని ప్రశ్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను వెంటాడి వేటాడి ప్రాణాలు తీశారు. అక్రమ కేసులు పెట్టి వేధించారు. కానీ ఒక్క కార్యకర్త కూడా ఎత్తిన జెండా దించలేదు. ప్రశ్నించినవారి గొంతునొక్కేందుకు గొంతులు కోశారు. మన పసుపు సింహం చంద్రయ్య గొంతు కోస్తున్నా జై తెలుగుదేశం అని ప్రాణాలు వదిలాడు. ఎందరో కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారు. వారి స్ఫూర్తి టీడీపీలో శాశ్వతంగా ఉంటుంది. ఎత్తిన జెండా దించని కార్యకర్తల త్యాగాల వల్లే కూటమి అధికారంలోకి వచ్చింది. మీ త్యాగాలకు మహానాడు వేదికగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మీ త్యాగాలు వృథా కానివ్వం. కార్యకర్తల కష్టాలను గుర్తిస్తాం. సంక్షేమం అందిస్తాం. వర్షాలు వస్తున్నా మహానాడు జయప్రదం చేయాలని వచ్చిన కార్యకర్తలను చూస్తుంటే ఆనందంగా ఉంది.

**పాలనలో టీడీపీ ట్రెండ్ సెట్టర్**

దేశంలో అనేక పార్టీలు ఉన్నాయి. కానీ ప్రజల జీవితాలను ఇంతలా ప్రభావితం చేసిన పార్టీ మాత్రం టీడీపీనే. అటు తెలంగాణ నుంచి ఇటు ఉత్తరాంధ్ర వరకూ అభివృద్ధి అంటే టీడీపీ ఆవిర్భావం ముందు, తర్వాతగా చూడాలి. ఇది చరిత్ర చెప్పిన వాస్తవం. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్. టీడీపీ పాలనే బ్రాండ్ అంబాసిడర్. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు నుంచి ఆడబిడ్డల ఆస్తి హక్కు వరకూ, బాలికా విద్యకు ప్రోత్సాహం నుంచి ప్రత్యేక మహిళా వర్సిటీ వరకూ, లోటు కరెంటు నుంచి మిగులు విద్యుత్ వరకూ రూ. 2 కే కిలో బియ్యం నుంచి పక్కా ఇళ్ల వరకూ, రూ.30 పింఛను నుంచి రూ.4 వేల పింఛను వరకూ, వంట కష్టాలను దీపం పథకం తప్పించడం నుంచి డ్వాక్రా సంఘాల సాధికారత వరకూ నిరుద్యోగ పరిస్థితులను నుంచి ఐటీ ఉద్యోగాలతో విదేశాల్లో సత్తా చాటే వరకూ, సీమలో రైతుల సాగునీటి కోసం తల్లడిల్లే పరిస్థితి నుంచి డ్రిప్ సబ్సిడీలతో సిరులు పండించే వరకూ, బడుగు బలహీన వర్గాలకు అధికారం చూపిన తొలి పార్టీ టీడీపీ. అడిగే పరిస్థితి నుంచి బీసీలు శాసించే పరిస్థితికి తెచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం. ఒక వర్గం, ఒక ప్రాంతం అని కాదు ఏ అంశమైనా పసుపు జెండా పుట్టకముందు పుట్టిన తర్వాత అని గీత గీసి చెప్పే పరిస్థితి. మనందరం టీడీపీ రాజకీయ పాఠశాలలో విద్యార్థులమే.

**నేను నిత్య విద్యార్థిని**

నేను నిత్య విద్యార్థిగా ఉంటాను. ప్రతిరోజూ నేర్చుకుని ప్రజలకు ఉపయోగపడతాను. కార్యకర్తలే నాకు ఆయుధాలు. మీరు నేనూ కలిస్తే ఆకాశమే హద్దుగా పనిచేయొచ్చు. పాజిటివ్ పాలిటిక్స్ మన విధానం, రాష్ట్రం ఫస్ట్ అనేది మన సంకల్పం. ప్రతిపక్షంలో అవినీతిపై పోరాడాము. అధికారంలోకి రాగానే అవినీతి రహిత పాలన అందిస్తున్నాము. ప్రజల ఆస్తులు, ప్రజల హక్కులకు రక్షణ కల్పించాం. ఇకపైనా చేస్తాం. భావితరాల భవిష్యత్ కు అవసమైన పాలసీలు తెచ్చాం. పాజిటివ్ పాలటిక్స్ తో రాజకీయాల్లో విలువలు పెంచిన పార్టీ టీడీపీనే. నేడు తెలుగు రాష్ట్రాల్లో వివిధ పార్టీల్లో టీడీపీ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులే ఉన్నారంటే అదీ మన సత్తా. మనది మోస్ట్ సక్సెస్ ఫుల్ మోడల్. ప్రజలిచ్చిన తీర్పును ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలకే ఉపయోగించాం. సొంత అవసరాలకు వాడలేదు. వాడము. అదే టీడీపీ చిత్తశుద్ధి. మన పార్టీ విధానాలు, మన ఆలోచనలు దేశంలో ఇతర పార్టీలకు బ్లూ ప్రింట్ గా నిలిచాయి.

**సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం**

రాజకీయాల్లో సామాజిక న్యాయం టీడీపీ తెచ్చిన అతి పెద్ద విప్లవం. అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు ఇచ్చాం. 40 ఏళ్లకు ముందే బీసీలను రాజకీయాల్లో భాగస్వాములు చేశాం. ఇదే టీడీపీని తిరుగులేని శక్తిగా మార్చింది. మన తర్వాత దేశంలో అన్ని పార్టీలు బీసీలను గుర్తించే పరిస్థితి వచ్చింది. సంస్థాగతంగా దేశంలో బలమైన పార్టీ టీడీపీ. ఒక ప్రాంతీయ పార్టీగా పుట్టి కోటి సభ్యత్వాతలను 45 రోజుల్లోనే పూర్తి చేసిన ఏకైక పార్టీ టీడీపీ.

**అభివృద్ధికి కేరాఫ్ ఏపీ కాబోతోంది**

స్వాతంత్రం వచ్చిన తర్వాత 78 ఏళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో రాబోయే 22 ఏళ్లలో అంతకుమించి రెట్టింపు అభివృద్ధి జరగబోతోంది. 2025 మహానాడు ఒక చరిత్ర తిరగరాయబోతోంది. మంత్రి లోకేష్ ఆరు శాసనాలతో ఒక బ్లూ ప్రింట్ విడుదల చేస్తారు. నేరస్థులు ఎక్కడున్నా వదిలిపెట్టే సమస్య లేదు. నదుల అనుసంధానం, పోలవరం పూర్తి చేసి జలహారతి ద్వారా ప్రతి ఎకరాకు నీరిచ్చి తెలుగు ప్రజల రుణం తీర్చేలా తీర్మానం చేస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌కు నాంది పలుకుతాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు వంటివి చేసి ప్రపంచంలోనే లాజిస్టిక్ కాస్ట్ తగ్గేలా మన ఆలోచనలు ఉంటాయి. ఆ రోజు నేను హైటెక్ సిటీ నిర్మించి హైదరాబాద్ లో ఐటీ తెచ్చాను. ఈ మహానాడు ద్వారా క్వాంటమ్ వ్యాలీ, ఏఐకి ప్రాధాన్యత ఇచ్చి తెలుగుజాతిని ముందుకు నడిపిస్తాను. ప్రధాని నాయకత్వంలో వికసిత్ భారత్ తయారుచేస్తే మనం స్వర్ణాంధ్ర 2047 తెచ్చాం. 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ ధ్యేయంగా పెట్టుకుని ప్రతి ఒక్కరి ఆదాయం రూ. 55 లక్షలు ఉండేలా కార్యక్రమం రూపకల్పన చేశాం. ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరగాలి. 2047 నాటికి జీరో పావర్టీ సాధించి దేశానికి ఒక దశదిశ నిర్దేశిస్తాం. ఆ తర్వాత పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించే విధానానికి శ్రీకారం చుడతాం. అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటం మన విధానం. రాబోయే పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితినే కాదు మనం అనుకున్న విధానాలు అమలు చేసి వ్యవస్థనుగాడిలో పెట్టే బాధ్యత నాది. ప్రపంచంలోనే తెలుగు జాతి నెంబర్ వన్ గా చేసే బాధ్యత మనందరిదీ.



**పెద్ద నోట్లు రద్దు చేయాలి**

నేను డిజిటల్ కరెన్సీ పెట్టమని ప్రధానికి రిపోర్ట్ ఇచ్చాను. దీని వల్ల అక్రమార్కులను తేలిగ్గా పట్టుకోవచ్చని చెప్పాను. ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలి. పెద్ద నోట్లు రద్దు చేస్తేనే దేశంలో అవినీతి పోతుంది. పార్టీకి డొనేషన్ ఇవ్వాలంటే నేరుగా ఫోన్ ద్వారా అకౌంట్ లోకి డబ్బు చెల్లించవచ్చు అని చంద్రబాబు అన్నారు.







## ప్రతి ఒక్కరికీ సంక్షేమం

రోడ్లు, మౌలిక సదుపాయాలు, వ్యాపారాలు, పెట్టుబడులు, ఉపాధి, ఉద్యోగాలు, నోటిఫికేషన్లతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. 64 లక్షల మందికి రూ.4 వేలు, రూ.6 వేలు, రూ. 10 వేలు, రూ. 15 వేలు పింఛను ఇచ్చే ఏకైక రాష్ట్రం దేశంలో ఏపీనే. ఏటా రూ.33 వేల కోట్లు నేరుగా పేదల సేవలో మొదటి తారీఖున పేదలకు అదిస్తున్నాం. అన్నా క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నాం. దీపం పథకంతో కోటి మందికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం.ఉచిత ఇసుక, మత్సకారుల సేవలో ఆర్థిక సాయం, అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు గౌరవ వేతనాలు పెంచాం. డీఎస్సీ నోటిఫికేషప్ ఇచ్చాం. స్కూళ్లు తెరిచేలోగా తల్లికి వందనం అందిస్తాం. సీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేయడం, ఏపీలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సాహించడం చేస్తున్నాం. మిరప రైతులకు ఇబ్బంది వస్తే కేంద్రంతో మాట్లాడాం. కోకో రైతులకు ఇబ్బంది వస్తే సబ్సిడీ ఇచ్చాం. సీమలో మామిడి రైతులకు ఇబ్బంది వస్తే ఆదుకుంటున్నాం. పొగాకు రైతులను ఆదుకున్నాం.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. పారిశ్రామిక వేత్తలతో నమ్మకం కల్పించి పెట్టుబడులు తెస్తున్నాం. 11 నెలల్లో 6 స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డులు పెట్టి 76 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. దీనివల్ల రూ.4 లక్షల 96 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చాము. 4 లక్షల 57 వేల మందికి ఉద్యోగాలు వస్తున్నాయి. రూ.10 లక్షల కోట్ల అప్పులు వారసత్వంగా వచ్చాయి. రూ.లక్షా 20 వేల కోట్ల బిల్లుల పెండింగ్ ఉన్నాయి. టీడీపీ మీద కక్ష గట్టి నీరు చెట్టు, నరేగా వంటి పనులకు బిల్లులు ఇవ్వలేదు. ఐటీ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్ ,మన మిత్ర తెచ్చాం. ఇదో గేమ్ ఛేంజర్.











# విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

**వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** రైతులకు విత్తనాలను అధిక ధరలకు అమ్మితే ఫర్టిలైజర్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హెచ్చరించారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని పరమేశ్వర వితన విక్రయ దుకాణం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రం, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. గీసుగొండలోమండల కేంద్రంలోని రాశి సీడ్స్ కంపెనీ గోడాన్ ను తనిఖీ చేసి గోడాన్ స్టోరేజ్ పాయింట్ నుండి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు పంపిణీ ప్రక్రియ ను స్టాక్, రసీదులు,బిల్లులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని, సంబంధిత కంపెనీ పేరుతో రసీదు తప్పనిసరిగా రైతులకు అందించాలని ఆదేశించారు. కల్తీ, నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. జిల్లావ్యాప్తంగా నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయ అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలను నియమించి నిత్యం విత్తనాల దుకాణాల పై నిఘా పెట్టి తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ ధరలకు అమ్మితే షాపు లైసెన్స్ లు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణంలో నిల్వల వివరాలను ప్రతిరోజు వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏ దామోదర్, వ్యవసాయ అధికారి కృష్ణ, తదితరులు ఉన్నారు.




వరి పరిశోధన సంస్థ వద్ద విత్తనాల కోసం

# రైతులు ఆందోళన

**విత్తనాలు స్టాక్ లేదని బోర్డులు**

**రాజేంద్రనగర్, మహా:** రాజేంద్రనగర్ మండలంలోని భారతీయ వరి పరిశోధన సంస్థ ఐ సి ఏ ఆర్ ముందు మంగళవారం రైతుల ఆందోళన చేశారు. మే నెల 27వ తేదీన నిర్వహించవలసిన విత్తన మేళాని 2025, డి ఆర్ ఆర్ దాన్ 75 ను విత్తనాల అమ్మకాన్ని అధికారులు రద్దు చేయడంతో విషయం తెలియక రైతులు పెద్ద సంఖ్యలో భారతీయ వరి పరిశోధన సంస్థ ముందు ఆందోళన నిర్వహించారు. రంగంలోకి దిగిన పోలీసులు రైతులను సముదాయించి అధికారులతో మాట్లాడి ప్రతి రైతుకు 2 కేజీల ఒక వరి బ్యాగ్ విత్తనాలు ఇచ్చారు. రైతులను చూసి అధికారులు విత్తనాలు అందుబాటులో లేవని బోర్డులు ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన రైతులు ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి రైతులు భారత వరి పరిశోధన సంస్థ వద్దకు వచ్చి విత్తనాలు తీసుకుందామని ఎన్నో కిలోమీటర్ల దూరం నుంచి వచ్చామని తీరా ఇక్కడ చూస్తే విత్తనాలు ఇవ్వలేదు. విత్తనాలు ఇస్తారేమో అని ఆశ పడ్డామని, ఆశ నిరాశ అయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# అభివృద్ధికి మారుపేరు ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**800 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి**

ప్రజా సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పీట
మా ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమే....
వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




**జనగామ మహా;** జనగామ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్, చిల్పూర్, జఫర్ గడ్ మండలాలకు సంబందించిన 68మంది లబ్ధిదారులకు 32లక్షల 82వేల 500రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ కావ్య మాట్లాడుతూ గత 20ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అని అన్నారు. నియోజకవర్గం లో విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ దేవాదుల ద్వారా ప్రతీ ఎకరానికి గోదావరి జలాలు అందించేందుకు కాలువల అభివృద్ధి, 100పడకల అస్పత్రి నిర్మాణం, డిగ్రీ కాలేజీ నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కొంగరకలాన్‌లో సమాధుల కూల్చివేత



## పేదల బొందలగడ్డ కబ్జా

- ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నిర్వాకం
- చెరువు కింద కాలువ ధ్వంసం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మండలం, కొంగరకలాన్ గ్రామంలో నిర్ధాక్షణంగా పేదల పూర్వీకుల సమాధులను కూల్చివేసిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ. సమాధులు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కొంగరకలాన్ గ్రామ వాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ.. తమ పూర్వికుల సమాధులు ఫిరోజ్గూడ సమీపంలో ఉండేవని, ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వాటిని కూల్చివేసిందని, సదరు సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చెరువుకట్ట పైన ఉన్న సమాధులను కూల్చివేసి, నాలను పూర్తిగా ధ్వంసం చేయడం జరిగింది. రెవెన్యూ, అధికారులు ఇరిగేషన్ అధికారులు ఈ యొక్క నాలాను కబ్జాకు గురికాకుండా కాపాడాల్సిందిగా కోరారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్**




**వరంగల్ మహా;** దొంగతనాలే వృత్తిగా మార్చుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన వరంగల్ మట్టెవాడ పోలీసులు. ఈ సందర్భంగా మంగళవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందుతుల వివరాలను వెల్లడించారు. రైలు ద్వారా ఇతర రాష్ట్రాలకు ప్రయాణం చేస్తూ రైల్వే స్టేషన్ కు సమీపంలో గల తాళం వేసి ఉన్న ఇండ్లను రెక్కి నిర్వహించి రాత్రి సమయంలో టార్గెట్ చేసి దొంగతనం చేస్తారని ఏసిపి తెలిపారు.

**నేర చరిత్ర వివరాలు..**

నిందితుల్లో ఒకడైన వెంకటరామ గోడ్మారే వీధి వీధి తిరిగి బోళ్లు అమ్ముట ద్వారా వచ్చే డబ్బులు జల్సా లకు సరిపోకపోవడంతో దొంగతనం చేసినట్లయితే సులభంగా డబ్బులు సంపాదించవచ్చు ననే ఉద్దేశంతో మొదటగా 2008 సంవత్సరంలో దొంగతనం చేయడం ప్రారంభించి, అప్పటినుండి తెలంగాణ, మహారాష్ట్ర మరియు చత్తీస్గడ్ రాష్ట్రాల లో 20 కి పైగా దొంగతనాలు చేయడం జరిగింది. రెండవ నిందితుడైన రహీం జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో అక్కడి సుపారి గ్యాంగ్ లో చేరి 2019 సంవత్సరంలో సుపారి మర్డర్ చేయడం ప్రారంభించినాడు. దీనితో అతనిపై రెండు మర్డర్ కేసులు నమోదు కావడం, ఎక్కువ కాలం జైలులో ఉండడం వల్ల మహారాష్ట్ర నందు గల అమరావతి జైలులో ఉన్న సమయంలో, మొదటి నిందితుడైన వెంకటరామ గోడ్మారే పరిచయమైనాడు. అతని సలహా మేరకు 2022వ సంవత్సరం నుండి ఇరువురు కలిసి తెలంగాణ, మహారాష్ట్ర చత్తీస్గడ్ ఏరియాలలో దొంగతనాలు చేయడం ప్రారంభించి చివరిగా ఇరువురు 2024 సంవత్సరం జూన్ నెలలో రాయపూర్ ఏరియాలో దొంగతనం చేసి రాయపూర్ జైలుకు వెళ్లి తిరిగి, మే 1వ తేదీన రిలీజ్ కావడం జరిగింది. ప్రస్తుతం వారు బేల్ పై ఉన్నందున, వారి జల్సాలకు లాయర్ కు డబ్బులు ఇవ్వాల్సి ఉన్నందున మళ్లీ తేదీ 11/05/2025 వ రోజున ట్రైన్ ద్వారా వరంగల్ చేరుకొని రాత్రి సుమారు 7 గంటల సమయంలో బ్యాంక్ కాలనీ II, శాంతినగర్ ఏరియాలోని భయ్యా స్వామి యొక్క తాళం వేసి ఉన్న ఇంటిలో తాళాలు పగలగొట్టి తొమ్మిది తులాల బంగారం, దాని విలువ Rs.8,10,000/ మరియు Rs.1000/ నగదు దొంగతనం చేసి వెళ్లడం జరిగిందని ఏసీపి గుర్తు చేశారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

1. మీరు ఊరికి వెళ్ళే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు మరియు బంగారం ఆభరణాలు పెట్టకండి వాటిని బ్యాంకు లాకర్లో లేదా భద్రంగా ఉన్న చోట దాచుకోవడం ఉత్తమం.
2. బీరువా తాళం చెవులు బీరువా పైన కానీ, బీరువా లోని బట్టల క్రింద, ఇంట్లో పెట్టి వెళ్లవద్దు.
3. మీ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది, భద్రత ఎక్కువగా ఉంటుంది.మీ ఇంటికి సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకుని డివిఆర్ ని రహస్య ప్రదేశాలలో భద్రపర్చుకోవాలి. అలాగే మొబైల్ యాప్ ద్వారా సీసీకెమెరా దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది.
4. ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్ళెం పెట్టకండి. ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలి. ఆ ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచండి.బయట గేటుకు లోపల నుంచి తాళం వేయండి. బయటకు వెళ్ళేపుడు ఇంట్లో అలాగా బయట కూడా లైట్ వేసి ఉంచండి.
5. పేపర్ బాయ్ , పాలు వేసే వాళ్లకు రావద్దని చెప్పండి. నమ్మకమైన వాచ్ మెన్ లను మాత్రమే నియమించుకోండి.
6. మీరు ఊరికి వెళ్ళేటప్పుడు మీకు నమ్మకమైన వారికి అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వండి.
7. మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయకండి.

మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే 100 టోల్ ఫ్రీ నెంబర్ కు గాని, మట్వాడా పోలీస్ 8712685005 కు డయిల్ చేయండని సూచించారు. ఈ సందర్భంగా దొంగతనాలే వృత్తిగా మార్చుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర కేటుగాళ్ళను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మట్టెవాడ ఇన్స్పెక్టర్ టి గోపిరెడ్డి, ఎస్ఐ నవీన్ కుమార్ తో పాటు టీం, పీసీ హరికాంత్, మీర్ మహ్మద్ అలీ, రాజేష్, ఎఎఓ మహమ్మద్ సల్మాన్ పాషా, టీమ్ పీసి నాగేష్ రెడ్డి, పిసి ప్రవీణ్ లను పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఉనికి కాపాడుకునే పరిస్థితిలో ప్రతిపక్షాలు

**మార్కెట్ చైర్మన్ యాట గీతా నర్సింహ**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆమనగల్ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ... ప్రతిపక్షాలు అయిన బీజేపీ, బీఆర్ఎస్ తమ ఉనికి కాపాడుకోవటానికే అధికార పార్టీ కాంగ్రెస్ పై బురద జల్లుతున్నాయి అని, మరోసారి బీజేపీ, బీఆర్ఎస్ చీకటి స్నేహం బయట పడిందని మార్కెట్ చైర్మన్ యాట గీతా నర్సింహ అన్నారు. రైతుల దగ్గరికి వెళ్లి వాస్తవాలు తెలుసుకొని ధర్నాలు, రాస్తారోకోలు చెయ్యాలి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతును రాజును చేసింది,రైతులకి గిట్టుబాటు ధర, సన్నలకి 500 ల బోనస్, రైతులకి ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత రేవంత్, ప్రజా ప్రభుత్వానిది అని చైర్మెన్ అన్నారు. ప్రకృతి వల్ల తడిచిన ధాన్యానికి మమ్మల్ని బాద్యుల్ని చేయటం తగదు, అయినా కూడ తడిచిన ప్రతి గింజను ప్రజా ప్రభుత్వం కొంటుంది. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చెయ్యటం సిగ్గు చేటు, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్లోనూ రైతులకి ఎలాంటి ఇర్బంది కలగకుండా చరిత్రలో ఎప్పుడు లేని విధంగా మా సొంత డబ్బులతో రైతులకి నీళ్లు, మధ్యానం అన్నం పెడతుంటే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక ప్రజా ప్రభుత్వం పై బురదజల్లుతున్నారు. కబర్దార్ ప్రతిపక్ష నాయకుల్లారా, కేసీఆర్ పది సంవత్సరాలు వరి వేస్తే ఉరి అన్నారు. రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. కేంద్రములో ఉన్న బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలతో రైతుల నడ్డి విడిచింది, మీరు మా ప్రజా ప్రభుత్వం పై ఆరోపణలు చెయ్యటం సిగ్గు చేటు అని చైర్మెన్ అన్నారు. మార్కెట్ లో రైతులకి కావాల్సిన అన్ని వసతులు కవర్లు, తడిపత్రాలు, గోనబస్తాలు ఇస్తున్నాం,మంచినీళ్ళు, అన్నం మంచి మంచి వసతులు రైతులకి కల్పిస్తున్నాం.చరిత్రలో ఎప్పుడు రైతులకి ఇవ్వని, ఏ ప్రభుత్వంలో ఇవ్వని గిట్టుబాటు ధర ఇస్తూ, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్లో రైతుల దగ్గర రోజుకి 4000 బస్తాలు కొనుగోలు చేస్తూ, ఇప్పటి వరకు 1,36,351 పైనే బస్తాలు రికార్డు స్థాయిలో కొన్న ప్రభుత్వం మా ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న మంచిని ఓర్వలేక పనికట్టుకుని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మాపై, ప్రభుత్వం పై బురద చల్లాలని చూస్తే రైతులే మీకు తగిన బుద్ధి చెప్పుతారని మార్కెట్ కమిటి చైర్మన్ యాట గీతా నర్సింహ ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకి హెచ్చరించారు.

# భూ సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర చాలా కీలకమైనదని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం వరంగల్ దేశాయిపేటలోని సి కె ఎం కళాశాలలో లైసెన్స్ సర్వేయర్‌లకు సర్వే సెటిల్‌మెంట్ , భూ రికార్డుల శాఖ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కారం కోసం ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజు భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నోటిఫికేషన్ జారీ చేసి, వారిని ఎంపిక చేసినట్లు చెప్పారు. జిల్లాలో 315 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లకు సోమవారం నుంచి 50 రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికి అనుభజ్ఞులైన రిటైర్డ్ సర్వేయర్లు థియరీతో పాటు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం పరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణులైన వారినే సర్వేయర్లుగా నియమిస్తామన్నారు. ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించిన సర్వే ఎఫ్ లైన్ వంటి సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకించి రెవెన్యూకు చెందిన గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారం కోసం నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని లైసెన్స్‌డ్ సర్వేయర్‌లు చేసిన భూ సర్వేను ప్రభుత్వ సర్వేయర్‌లు పరిశీలన చేసి, మ్యాప్ రూపొందిస్తారని కలెక్టర్ అన్నారు. భూ భారతి చట్టం అమలు కోసం ఎంపిక చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అభ్యర్థులకు శిక్షణ మెటీరియల్ కిట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి దేవరాజు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ నాగభూషణం, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, పర్యవేక్షకులు అబూతల్హా, డిప్యూటీ సర్వేయర్ ప్రభాకర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



**హన్మకొండ మహా;** ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసేందుకు సరిపోను నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు పురుగు మందులను దుకాణాలలో అందుబాటులో ఉంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని లక్ష్మి ఫర్టిలైజర్స్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన, ఎరువులు, పురుగు మందుల నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లు బుక్కులను కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాములో నిల్వ చేసి ఉన్న విత్తనాలు, ఎరువులు, మందులను కలెక్టర్ పరిశీలించారు. ఈపాస్ మిషన్ వినియోగం గురించి విత్తన, ఎరువుల దుకాణాదారులను అడిగి తెలుసుకున్నారు. దుకాణాలలో విత్తన, ఎరువులు, పురుగు మందుల నిల్వలకు సంబంధించిన స్టాక్ బోర్డులను పరిశీలించారు. పత్తి విత్తన ప్యాకెట్లకు ఉన్న లేబుల్స్ ను పరిశీలించారు. అదేవిధంగా పత్తి విత్తనాలకు సంబంధించి ఎన్ని రకాలు నిల్వ ఉన్నాయి, ఏ రకం ఎక్కువగా విక్రయిస్తున్నారనే వివరాలను దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటల సాగులో సస్యరక్షణ చర్యలకు డ్రోన్ల ద్వారా నానో యూరియాను చల్లే విధంగా రైతులను ప్రోత్సహించాలని దుకాణదారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, మండల వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# శిక్షణలో సర్వే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి




**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హన్మకొండ మహా;** లైసెన్స్ సర్వేయర్ శిక్షణా కార్యక్రమంలో సర్వేకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం (టిటిడిసి)లో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ కార్యక్రమంలో సర్వే నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై నిర్వహిస్తున్న బోధనా తరగతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బోధనా అంశాలను కలెక్టర్ విన్నారు. శిక్షణార్థులతో కలెక్టర్ సంభాషించారు. శిక్షణ కార్యక్రమం గురించి శిక్షణార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్ను కలెక్టర్ చేతుల మీదుగా అభ్యర్థులకు పంపిణీ చేశారు. సర్వేకు సంబంధించిన అంశాలపై శిక్షణార్థులకు 50 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి భూవివాదాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. భూ వివాదాలు లేకుండా ఉండాలంటే ఫీల్డ్ సర్వే చేయడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. శిక్షణ అనంతరం పరీక్షను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి భూభారతి సర్వే చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. భూ వివాదాల పరిష్కారానికి సర్వే రిపోర్ట్ ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. శిక్షణార్థుల హాజరు అన్ని రోజులపాటు అటెండెన్స్ పక్కాగా తీసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం క్షేత్రస్థాయిలో బాగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి అధికారినిపై విచారణ?

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం !**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారిని గత వారం రోజుల క్రితం, అవినీతి అక్రమాలపై విచారణ ఎదుర్కోవడం జరిగింది. ఆ అధికారినీపై అవినీతి అక్రమాలకు పాల్పడ్డట్టు అభియోగాలు రావడంతో, ఆమెపై విచారణ జరిపినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహించిన జిల్లా అధికారి, 2021 22 సంవత్సరంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెలుబుచ్చాయి. మహిళా మత్స్య పారిశ్రామిక అధ్యక్షురాలు ఆరోపణలు చేస్తూ, ఇచ్చిన ఫిర్యాదు మేరకు, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ నిజ నిర్ధారణ అధికారులను నియమించి, విచారణ చేసినట్లు విశ్వాసనీయ సమాచారం మేరకు తెలిసింది. వారం రోజుల క్రితం మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టినట్లు సమాచారం.

తప్పతాగిన యువకులు

# భార్య భర్తలపై దాడి

**ఇద్దరిని అదుపులో తీసుకున్న పోలీసులు**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా లోని గీసుగొండ మండలం మనుగొండా గ్రామంలో ఓ బెల్ట్ షాప్ లో తప్ప తాగిన మైకంలో ఇద్దరు యువకులు షాప్ యజమానితో గొడవ పడి పరస్పరం దాడి చేసుకోగా మధ్యలో యజమాని భార్య జోక్యం చేసుకోవడంతో మహిళ అనే చూడకుండా ఆమె పై కూడా దాడి చేసారు. ఈ ఘటనలో ఇరువురు స్వల్పంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఈ సంఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. బ్రతుకు తెరువు కోసం గ్రామంలో ఓ కిరాణం షాప్ బెల్ట్ షాప్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు దంపతులు. తాగిన మైకంలో ఇద్దరు యువకులు బెల్ట్ షాపులో తప్ప తాగి మాట మాట పెరిగేసరికి యువకులు భార్యాభర్తల పై దాడి చేశారు. అకారణంగా తన భర్త పై దాడి చేసి తన పై కూడా హత్యాచార యత్నానికి పాల్పడ్డారని దంపతులు గీసుగొండ పోలీస్ లను ఆశ్రయించారు. ఈ సంఘటనలో దాడికి పాల్పడ్డ ఇద్దరు యువకులను పోలీసుల అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని గీసుకొండ పోలీస్ ఇన్స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

## స్కూటీ ఢీకొట్టిన లారీ.. ఒకరికి తీవ్ర గాయాలు

**అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

**అబ్దుల్లాపూర్మెట్,మహా:** స్కూటీ ఢీకొట్టిన లారీ.. ఒకరికి తీవ్ర గాయాలు అయిన ఘటన అబ్దుల్లాపూర్మెట్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆర్ఎఫ్సీ సెక్యూరిటీ ఆఫీసర్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ అంబేద్కర్ నగర్కు చెందిన వట్టిపాక అశోక్కుమార్ (35) బిల్ కెప్టెన్గా రామోజీ ఫిలింసిటీలో పని చేస్తుంటాడు. మంగళవారం సాయంత్రం ఉద్యోగం నిమిత్తం అశోక్కుమార్ తన స్కూటీతో రామోజీ ఫిలింసిటీ బయలుదేరారు. ఆర్ఎఫ్సీ మెయిన్ గేట్ వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఆర్జే-11-జీసీ-0188 నెంబర్ గల లారీ వెనుక నుంచి స్కూటీని బలంగా ఢీకొట్టింది. దీంతో అశోక్ కుమార్కు తీవ్రగాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రయివేట్ దవాఖాన తరలించారు. లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు అబ్దుల్లాపూర్మెట్ పోలీసులు తెలిపారు. రామోజీ ఫిలింసిటీ సెక్యూరిటీ ఆఫీసర్ దాసు చిన్నమ్మ నాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అబ్దుల్లాపూర్మెట్ ఇన్స్పెక్టర్ వి. అశోక్రెడ్డి తెలిపారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..





**రాజేంద్రనగర్, మహా:** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వాంబే కాలనీ, గగన్ పహాడ్ లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం పర్యటించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో అధికారులను స్థానికులు ప్రశ్నించారు. వర్షాకాలం నేపథ్యంలో కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం నీటుగా ఉండాలని అధికారులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. కాలనీ వాసులు డ్రైనేజీలో వివిధ రకాలైన చెత్త వేయడం వల్లనే సమస్యలు పెరుగుతున్నాయ. మోరీలల్లో చెత్త వేయరాదు చెత్త తీసుకోవడానికి ఆటోలు వస్తున్నాయి కదా అందులో వేయాలని ఎమ్మెల్యే కాలనీ వాసులకు తెలిపారు. పలు కాలనీలలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు డిప్యూటీ కమిషనర్ రవి కిరణ్, ఈ ఈ నరేందర్ గౌడ్, వాటర్ వర్క్ జిఎం లక్ష్మి, స్ట్రీట్ లైట్ అధికారులు, ఎలక్ట్రిసిటీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సరికొండ వెంకటేష్,, ప్రేమ్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..

**జిల్లా విద్యాధికారి సుశీందర్రావు**




**రాజేంద్రనగర్, మహా:** రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హిందీ ఉపాధ్యాయులకు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎడిపై పాఠశాలలో శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్,ఆధ్వర్యంలో ఉపాధ్యాయులందరికీ ఐదురోజుల కెపాసిటీ బిల్డింగ్ అధికారి శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు శిక్షణ శిబిరాని పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వ డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం లక్ష్యం ప్రస్తుత సమాజంలో విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారికి లోను కాకుండా విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఉపాధ్యాయులందరికీ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డ్రగ్స్ వాడకం వల్ల జరుగు అనర్థాలు విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు డ్రగ్స్ రహిత అంశం పైన అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా శిక్షణ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన కల్పించడం ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యంగా పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉంచడానికి పాఠశాల నుండే విద్యార్థులలో అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ వినియోగంపై జరిగే అనర్థాలపై విద్యార్థులకు బేషరతుగా తెలిసే విధంగా చర్యలు చేపట్టాలి. ఈ బాధ్యత అందరిపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత అందరి ఉపాధ్యాయుల పైన ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ నరేందర్, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెత్త సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

**ఎల్బీనగర్ జోన్ రివ్యూ మీటింగ్ లో మేయర్ గద్వాల విజయలక్ష్మి**




**ఎల్బీనగర్,మహా:** కాలనీలు,స్లమ్ములలో పేరుకుపోతున్న చెత్తతో పాటు సీఎన్డి గార్బేజ్ లు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ముందుకు వెళ్తున్నామని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు.ఎల్బీనగర్ లోని జోనల్ కమీషనర్ ఆఫీస్ లో మంగళవారం జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి ఏర్పాటు చేసిన రివ్యూ మీటింగ్ లో పలు అంశాలపై మేయర్ విజయలక్ష్మి కార్పొరేటర్లు,అధికారులతో కలిసి సమీక్షించారు. జోన్ పరిధిలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అధికారులు ఆ సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారో వివరణ కోరారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, కార్పొరేటర్లు కలిసి సమన్వయంతో ముందుకు వెళుతు డివిజన్ లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్పొరేటర్ ల నుండి స్యానిటేషన్ యూనిట్స్ పెంచాలని డిమాండ్ వచ్చిందని తెలిపారు. చెరువులను క్లీన్ చేసేందుకు,చెరువుల్లో డ్రైనేజి కలవకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించినట్లు తెలిపారు.చాలా మంది స్వచ్ ఆటోలకు చెత్త వేయడం లేదని వేసే విధంగా చర్యలు తీసుకునే అంశాలపై మాట్లాడామని చెప్పారు.చెత్త వేసే పాయింట్స్ వద్ద కొన్ని బిన్స్ పెట్టేందుకు రాంకి సంస్థతో చర్చించినట్లు తెలిపారు.సీఎన్డి గార్బేజ్ అడ్డగోలుగా ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని అలా వేయకుండా కార్పొరేటర్లు కూడా అవగాహన కల్పించి అడ్డుకోవాలి తెలిపారు. జనం పెనాల్టీకి కూడా వెనక్కి వెళ్లకుండా అడ్డగోలుగా బహిరంగ ప్రదేశాలలో వేస్తున్నారని అన్నారు.స్పోర్ట్స్ స్టేడియాలు ఉపయోగించుకునే విధంగా తీసుకోవాల్సిన చర్యలు గురించి కూడా చర్చించామని తెలిపారు.వీధి కుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్ పై కూడా చర్చించామని ఎక్కడ లేని విదంగా ఎల్బీనగర్ లో అత్యధికంగా వీధి కుక్కల సంతాన నియంత్రణ కార్యక్రమం సక్సెస్ అవుతుందని చెప్పారు.పైన తెలిపిన అన్ని సమస్యలపై కూడ చర్చించి వాటి పరిష్కారం కోసం ముందుకు వెళ్తామని తెలిపారు.పెరిగిన జనాభాను గుర్తు పెట్టుకొని జరిగే ప్రమాదానాలను నియంత్రించెందుకు సరూర్ నగర్ రోడ్డు విస్తరణ వీలైనంత త్వరగా చేయాలని లింగోజిగూడా కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి కోరాడు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాఠిల్, హయత్ నగర్,ఎల్బీనగర్, సరూర్ నగర్ డిసిలు తిప్పర్తి యాదయ్య,అరుణ,సేవా ఇస్లావత్ తో పాటు రెవిన్యూ,ఇంజనీరింగ్ శ్యానిటేషన్,టౌన్ ప్లానింగ్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏన్ కౌంటర్లన్ని ప్రభుత్వ.. హత్యలే



**షాద్ నగర్, మహా:** ప్రస్తుతం దేశంలో మావోయిస్టుల పై చేస్తున్న ఎన్ కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని పలు రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల పౌర హక్కుల సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ముందు రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు పౌర హక్కుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లక్ కార్డులు చేతబట్టి నిరసనకు దిగారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....ఈ దేశ మూలవాసులైన ఆదివాసులపై ఆదివాసుల హక్కులను హరించే విధంగా మావోయిస్టుల పేరుతో ఆదివాసులతోపాటు మావోయిస్టులను హత్యలు చేస్తూ ఎన్కౌంటర్లో మృతి చెందిన మృతదేహాలను బంధువులకు ఇవ్వకుండా రాజ్యాంగా స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి పార్టీ పాలన కొనసాగిస్తుందని వెంటనే ఆపరేషన్ కగర్ ను నిలిపివేయాలని ఆదాని అంబానీల కోసమే ఆపరేషన్ కగర్ పేరుతో బిజెపి ప్రభుత్వం అత్యంత పాషవీకంగా మావోయిస్టుల పైన ఆదివాసుల పైన హత్యకాండను కొనసాగిస్తుందని దీన్ని విరమించుకోవాలని మావోయిస్టులను అంతం చేయడం అమిత్ షా తరం కాదని ఇలాగే వ్యవహరిస్తే ప్రజల నుండి తీవ్రమైన తిరుగుబాటు మొదలవుతుందని కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ అమిత్ షా గుర్తించుకోవాలన్నారు వ్యక్తులను చంపవచ్చు కానీ వారి ఆలోచనలు వారి ఆశయాన్ని చంపలేరని ఈనెల 21వ తేదీన జరిగిన బూటకపు ఎన్కౌంటర్లో 27 మంది మావోయిస్టులను చంపివేశారని ఆ ఎన్ కౌంటర్ లో కేశంపేట మండలం వేముల్ నర్వ గ్రామానికి చెందిన విజయలక్ష్మీ అలియాస్ (భూమిక ) మరణించిందని చివరికి వారి శవాలను కూడా బంధువులకు ఇవ్వకుండా పోలీసులే కాల్చివేయడం ఎంతవరకు సమంజసం అని శవాలకు కూడా హక్కులు ఉంటాయని అనేది బిజెపి పాలకులు గుర్తించుకోవాలన్నారు ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం జీవించే హక్కును కూడా కాలరాస్తుందని దేశాన్ని ఓవైపు కొల్లగొడుతున్న ఆదానీ అంబానీలతో పాటు కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తూ పేద ప్రజలపై పేద ప్రజల కోసం పోరాడుతున్న ఆదివాసులపైన మావోయిస్టులపైన ప్రజాస్వామికవాదుల పైన హత్యకాండ ను కొనసాగిస్తుందన్నారు బిజెపి ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యకాండను వెంటనే మానుకోవాలన్నారు లేదంటే భవిష్యత్తులో బిజెపి ప్రభుత్వానికి మోడీ అమిత్ షాకు బుద్ధి చెప్పాల్సి వస్తుందని వస్తుందన్నారు.

## నవ భారతావనికి పునాదులు వేసిన నెహ్రూ

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి నివాళి**



**షాద్ నగర్, మహా:** స్వాతంత్ర్య సమరయోధులు, నవ భారతావనికి పునాదులు వేసిన మొట్టమొదటి ప్రధాని, భారత రత్న జవహర్ లాల్ నెహ్రూ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీజీఎంఎఫ్సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, నేతలు చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూర్ బస్వం, సర్వర్ పాషా, అన్వర్, దేవేందర్, రాయికల్ శ్రీనివాస్,శ్రీను నాయక్,తుపాకుల శేఖర్, మంకల శ్రీశైలం, వాసు, గంగమోని సత్తయ్య, రవితేజ తదితరులు పాల్గొన్నారు..

## పూజల పేరుతో మహిళలను నమ్మించి మోసం

**నగదు, బంగారు ఆభరణాలు కాజేసి పారార్ అయిన స్వామీజీ**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**ఎల్బీనగర్,మహా:** పూజల పేరుతో ఒక మహిళలను నమ్మించి మోసం చేసి అమె దగ్గర ఉన్న బంగారు ఆభరణాలు,నగదు కాజేసిన పూజారిపై కేసు నమోదు అయిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.బాధితుల వివరాల ప్రకారం నాగోలు జైపురికాలనీ సమీపంలో వీరారెడ్డి కాలనీ చెందిన గుండు రజినీ అదే కాలనీ ఆటో స్టాండ్ దగ్గర ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జ్యోతిష్యాలయం బోర్టు చూసింది.అక్కడుకు తన బంధవును తీసుకుని గురూజీ సాయి రాజ్ అనే వ్యక్తి వద్దకు వెళ్లింది. అతను తాను వశీకరణ నిపుణుడినని చెప్పుకుంటూ కుటుంబ సమస్యలకు పరిష్కారాలను అందిస్తున్నామని చెప్పాడు. అమెకు ఆమె కుటుంబ గురించి తప్పుడు సమాచారం ఇచ్చాడు.ని భర్తపై మరొక మహిళ ప్రభావం వల్ల విడిపోతాడని బాధిత మహిళను భయపెట్టాడు. మీ సమస్యలు పరిష్కరించడానికి శక్తిపీఠాల్లో ప్రత్యేక పూజలు చేయాల్సి ఉంటుందని నమ్మించాడు. దీంతో మహిళ దగ్గర పూజల పేరుతో సాయిరాజ్ రూ.32 వేల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలు తీసుకుని మోసం చేశాడు.వశీకరణ పేరుతో మరి కొన్ని పూజలు చేయాలని చెప్పాడు. దీంతో మోస పోయినట్లు గుర్తించి మహిళ గత నెల 28 వతేదీన నాగోలు పోలీస్ స్టేషన్ లో బాధితురాలు రజని ఫిర్యాదు చేసింది.దీంతో నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు మంగళవారం మరో సారి పోలీస్ స్టేషన్ వచ్చింది. ప్రస్తుతం పూజారి సాయిరాజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.తమకు న్యాయం జరగడం లేదని మహిళ మరోసారి పీఎస్ కు రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

## మహిళల పక్షపాతి రేవంత్ రెడ్డి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**మైనారిటీ సోదరీమణులకు ఉచితంగా 258 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**

**హాజరైన మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్**

**షాద్ నగర్, మహా:** మహిళలకు స్వయం ఉపాధి కల్పన, ఆర్థిక స్వాలంబనే ధ్యేయం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి మహిళల పక్షపాతి అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసా కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ నియోజకవర్గంలోలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ద్వారా ఉచితంగా 258 మంది మైనారిటీ మహిళ సోదరీమణులకు కుట్టు మిషన్ల ను మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్.ఒబేదుల్లా కొత్వాల్ , జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్లు తో కలిసి 258 మంది లబ్ధిదారులకు అందచేసిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్.. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పార్టీ సీనియర్ నాయకులు జ్యుమడ్ ఖాన్, ఇబ్రహీం. స్వర్వర్ పాషా, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, అగ్గనూర్ బస్వం,కృష్ణ రెడ్డి, ఖదీర్,బాలరాజు గౌడ్,హరినాద్ రెడ్డి, ముబారక్ అలీ ఖాన్,జాఫర్, న్యాయవాది సబియా సుల్తానా, అలియా సుల్తాన బేగం, మహమ్మద్, కార్యకర్తలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

## ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలి

**బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాష్ డిమాండ్**



**కరీంనగర్, మహా:** పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. గత టిఆర్ఎస్ పాలకుల తరహాలోనే విద్యార్థులకు కాంగ్రెస్ అన్యాయం చేయాలని చూస్తే రేవంత్ రెడ్డి సర్కార్ గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లింపులు నిలిపివేసి ముందుగా పేద బడుగు బలహీన విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఇంటర్ డిగ్రీ పీజీ ఇంజనీరింగ్ వృత్తి విద్యా కోర్సుల సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల మంది విద్యార్థులకు గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు చెల్లింపులు నిలిచిపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు.. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాయక, మరి కొంతమంది విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ కొరకు కళాశాలల చుట్టూ తిరుగుతూ మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అదే విధంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల దగ్గర ఫీజుల వసూలు చేయలేక ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ రాక కళాశాల సిబ్బందికి జీతాలు ఇవ్వలేక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. విద్యార్థుల, కళాశాల యాజమాన్యం లను దృష్టిలో పెట్టుకొని వెంటనే ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.. లోగడ టిఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా విద్యార్థులను హరి గోస పెట్టింది ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే పంతాలో కొనసాగుతున్నట్టు కనిపిస్తుందని , అధికారంలోకి వచ్చిన 18 నెల నుండి విద్యార్థుల ఉసురు పోసుకుంటుందని ఘాటుగా విమర్శించారు. రియంబర్స్మెంట్లు రాకపోవడంతో చాలామంది విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న నాలుగు వేల కోట్ల ఫీజు బకాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఎన్నం ప్రకాష్ డిమాండ్ డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ , మెస్ చార్జీలు, బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని, ప్రైవేటు యూనివర్సిటీలో సామాజిక రిజర్వేషన్లు అమలు చేయాలని. బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అందరీని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఆపరేషన్ కగార్తో బూటకపు ఎన్కౌంటర్లు

**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి**


**రాజీవ్ గృహకల్పశాఖ మహాసభకు హాజరైన సీపీఐ నేతలు**




**అబ్దుల్లాపూర్మెట్,మహా:** ఆపరేషన్ కగార్తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు ఎన్కౌంటర్లకు పాల్పడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి అన్నారు. రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రాజీవ్ గృహకల్పశాఖ మహాసభ కామ్రేడ్ డావుల రాములు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''ఆపరేషన్ కగార్''తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు ఎన్కౌంటర్లకు పాల్పడుతున్నాయన్నారు. ఛత్తీస్గఢ్ ఎన్కౌంటర్లో పట్టుకొని కాల్చి చంపారని.. కనీసం మృతి చెందిన వారి భౌతిక కాయాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా.. పోలీసులే సామూహిక దహనాలు చేయడమేమిటని ప్రశ్నించారు. శాంతి చర్చలకు అంగీకరించకుండా మొండికేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ను వెంటనే ఆపి.. చర్చలు జరపాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని.. అంతరాలు లేని సోషలిస్టు సమాజమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ప్రజల హక్కుల కోసం నిరంతర పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రజల రాతలు మారలేదని.. వారికి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు. అందుకే ప్రజల తరపున ప్రజా ఉద్యమాలు నిర్మించి పోరాడుతామని హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న ప్రభుత్వ నియంత్రణ లేదని అన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు.. స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ నర్సింగ్ నాయక్ , యాదయ్య, గణేష్, రాము వెంకట్, బాబు, వలి, నరసింహ, శ్రీను, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాలు ఎరువుల కొరత లేకుండా చూడాలి


**జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి.. సంబంధిత అధికారులకు ఆదేశాలు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ధాన్యం కొనుగోలు,ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, వానకాల పంటల సాగుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రుతుపవనాలు ముందుగానే రాష్ట్రానికి రావడంతో రైతులు వ్యవసాయం చేయుటకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సూచించారు. వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులకు అవగాహన కల్పించాలని, రైతులకు విత్తనాలు ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండే విధంగా ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్మితే అమ్మిన వారిపై పిడి ఆక్ట్ కింద కేసును నమోదు చేయడం జరుగుతుందని కలెక్టర్ సూచించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పై సమీక్ష చేస్తూ మండల స్థాయిలో ధరల మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా చూడాలని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ పక్కాగా జరిగేలా క్షేత్రస్థాయిలో అధికారులు పని చేయాలని, అధికారులు ఎప్పటి కప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. భూ భారతి చట్టంపై మాట్లాడుతూ... జూన్ 3వ తేది నుండి 20వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులకు గ్రామాల వారిగా ప్రణాళికను బుధవారం లోగా సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, ఆర్డీవోలు చంద్రకళ, సరిత,వెంకట్ రెడ్డి, అనంత్ రెడ్డి, పిడి హౌసింగ్ హనుమంతు నాయక్, వ్యవసాయ శాఖ అధికారి నరసింహ, సివిల్ సప్లై అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో భర్తను చంపిన భార్య

**తరుచు గొడవల కారణంగా గోడకు గుద్ది,గొంతు నులిమి హత్య**



**ఎల్బీనగర్,మహా:** భర్తను భార్య హత్య చేసిన ఘటన వనస్థలిపురం పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం మర్రిబాయి తండాకు చెందిన సపావత్ కిషన్(40),వలిగొండ మండలం గోకారంకు చెందిన శిరీష(30) లకు 2016లో ప్రేమ వివాహం జరిగింది.గతంలోనే ఈ ఇద్దరికి వేరు వేరు పెళ్ళీలు అవ్వగా కిషన్ భార్య మృతి చెందగా ఓ కూతురు,కొడుకు ఉన్నాడు. శిరీషకు ఆమె భర్తకు విడాకులు అయ్యాయి.ఆ తర్వాత వీరి వివాహ అనంతరం వీరికి ఇద్దరు సంతానం కలిగారు.చిన్న కొడుకు పుట్టిన యాడాది నుండి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి.ప్రస్తుతం వీరు వనస్థలిపురంలోని హిల్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు.సోమవారం రాత్రి కిషన్ హిల్స్ కాలనీలోని ఇంటికి మధ్యం సేవించి వచ్చాడు.అదే సమయంలో కిషన్ కు శిరిషకు మధ్య గొడవ జరిగింది.అదే సమయంలో శిరీష క్షనికావేశంలో కిషన్ ను బలంగా గోడకు నెట్టేసింది.గోడకు తగిలిని కిషన్ అక్కడే కింద పడిపోయాడు.దీంతో చేతులతో గొంతు గట్టిగా నులమడంతో ఊపిరాడక కిషన్ అపస్మారక స్థితికి వెళ్ళాడు.వెంటనే కిషన్ ను శిరిష వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది అక్కడ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు డిక్లేర్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని కిషన్ కూతురు కుటుంభ సభ్యులకు సమాచారం అందించారు.కిషన్ కూతురు బిందు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు శిరిషపై హత్య కేసులో పాటు ఎస్సి,ఎస్టీ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఇది ఇలా ఉండగా ఓ వ్యక్తి కారణంగా భార్యాభర్తలు ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నట్లు హత్య వెనుక ఆ వ్యక్తి కూడా ఉండి ఉంటాడని కిషన్ కూతురు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# పేరుకు టాప్ కంపెనీ.. 3,000 మందికి లేఆఫ్స్?




స్వీడన్‌కు చెందిన వోల్వో కార్స్ ఖర్చు ఆదా ప్రణాళికలో భాగంగా సుమారు 3,000 ఆఫీస్ ఉద్యోగాలను తొలగించాలని నిర్ణయించింది. కంపెనీ పెరుగుతున్న ఖర్చులు, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) బలహీనమైన డిమాండ్, వాణిజ్య అనిశ్చితిని ఎదుర్కొంటున్నట్లు రాయిటర్స్ తెలిపింది. ఈ నేపథ్యంలో సంస్థ లేఆఫ్స్‌కు సంబంధించిన నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. కంపెనీ మాజీ సీఈఓ హకన్ శామ్యూల్సన్ తిరిగి వోల్వోకు నాయకత్వ బాధ్యతలు చేపట్టిన కొన్ని వారాల్లోనే ఈమేరకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కంపెనీ చేసే దాదాపు 18 బిలియన్ స్వీడిష్ క్రౌన్లు (సుమారు 1.9 బిలియన్ డాలర్లు) తగ్గించే ప్రణాళికలను సీఈఓ ఏప్రిల్‌లో ప్రకటించారు. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం లేఆఫ్స్ నిర్ణయం తీసుకున్నట్లు రాయిటర్స్ తెలిపింది. కంపెనీ మొత్తం సిబ్బందిలో 40 శాతం వాటా కలిగిన వైట్ కాలర్ ఉద్యోగులకు లేఆఫ్స్ ఇవ్వడం ద్వారా ఖర్చు తగ్గించుకోవాలని కంపెనీ యోచిస్తున్నట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థకు యూరప్‌లో 29,000 మంది, ఆసియాలో 10,000 మంది, అమెరికాలో 3,000 మంది ఉద్యోగులు ఉన్నారు. తాజాగా ప్రకటించిన లేఆఫ్స్ రీసెర్చ్, హ్యూమన్ రిసోర్సెస్, కమ్యూనికేషన్ వంటి వివిధ విభాగాల్లో ఉంటాయని శామ్యూల్సన్ తెలిపారు. వోల్వో కార్ కొత్త ఫైనాన్స్ చీఫ్ ఫ్రెడ్రిక్ హాన్సన్ మాట్లాడుతూ.. ఈ లేఆఫ్స్ వల్ల వ్యాపారం తాత్కాలికంగా ప్రభావితం చెందినా భవిష్యత్తులో మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ఉద్యోగ తొలగింపులు ఎక్కువగా స్వీడన్‌లోని గోథెన్ బర్గ్‌లో ఉంటాయని చెప్పారు. వోల్వో కార్స్ ప్రకారం.. దాదాపు 15% కార్యాలయ ఉద్యోగులను తొలగించనున్నారు. ఈ చర్య వల్ల కంపెనీపై 1.5 బిలియన్ క్రౌన్ల భారం పడుతుందని భావిస్తున్నారు. అయితే, ఈ ఇది దాని నిర్మాణాన్ని మరింత సమర్థవంతంగా చేయడానికి సహాయపడుతుందని కంపెనీ భావిస్తోంది.




## స్థిరపడుతున్న ఇండెక్స్ ఆప్షన్స్ మార్కెట్

నియంత్రణ నిబంధనలు కఠినతరం కావడంతో వరుసగా మూడు నెలల పాటు క్షీణించిన ఇండెక్స్ డెరివేటివ్స్, ఆప్షన్స్ మార్కెట్ క్రమంగా స్థిరపడుతున్న సంకేతాలు కనిపిస్తున్నట్లు రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. మార్కెట్ వర్గాలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయనడానికి వాల్యూమ్స్ నిదర్శనంగా నిలుస్తున్నాయని పేర్కొంది. గతేడాది నవంబర్ నుంచి కఠినతర నిబంధనల అమలు కారణంగా ఇండెక్స్ ఆప్షన్లలో ట్రేడింగ్ లావాదేవీలు గణనీయంగా పడిపోయాయి. 2024 ఏప్రిల్–నవంబర్ మధ్య కాలంతో పోలిస్తే 2024 డిసెంబర్ నుంచి 2025 మార్చి మధ్య సగటున రోజువారీ ప్రీమియం టర్నోవరు 18 శాతం క్షీణించింది. ఆప్షన్స్ కాంట్రాక్టుల సంఖ్య 60 శాతం పడిపోయింది. రూ. 10,000 లోపు నెలవారీ ప్రీమియం టర్నోవరు ఉండే ఇన్వెస్టర్ల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 2025 మార్చిలో 49 శాతం తగ్గింది. 2024–25 నాలుగో త్రైమాసికంలో తొమ్మిది సెక్యూరిటీస్ బ్రోకింగ్ సంస్థలపై నిర్వహించిన సర్వే ప్రకారం వాటి ఆదాయం 19 శాతం, లాభదాయకత 26 శాతం తగ్గిపోయాయి. అయితే, ఇప్పటికీ ట్రేడింగ్ కార్యకలాపాలు చారిత్రక స్థాయుల కన్నా అధికంగానే ఉన్నట్లు ఇక్రా పేర్కొంది.

# ఏఐ పరిస్థితి ఇంతే!.. ఉద్యోగులకు భయమేల



గత కొంతకాలంగా ఉద్యోగులను భయపెడుతున్న ఒకే ఒక అంశం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీ. దీనివల్ల ఉద్యోగాలు పోతాయని, ప్రపంచంలోని చాలా దేశాల్లో నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుందని.. కొందరు నిపుణులు కూడా వెల్లడించారు. ఇందులో ఏ మాత్రం నిజం ఉంది?, నిజంగానే ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయా?, నివేదికలు ఏం చెబుతున్నాయనే.. విషయాలను ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. ఏఐ దాదాపు అన్ని రంగాల్లోనూ.. సంచనలం సృష్టించింది. దీంతో చాలామంది భయపడ్డారు. అయితే ప్రస్తుతం కొన్ని నివేదికలు మాత్రం ఊహించినదానికి భిన్నంగా ఉన్నాయని, ఉద్యోగాలు ఎక్కడికీ పోవని చెబుతున్నాయి. అమెరికా డేటా.. ఏఐ ఉన్నప్పటికీ ఏడాదిలో ఇంటర్‌ప్రిటేషన్, ట్రాన్స్‌లేషన్‌కి సంబంధించిన ఉద్యోగాలు ఏడు శాతం పెరిగాయని చెబుతోంది. మనుషులను ఏఐ రీప్లేస్ చేస్తుందని చెప్పిన కంపెనీలు కూడా.. ఇప్పుడు మనిషి అవసరం ఖచ్చితంగా ఉందని స్పష్టం చేస్తున్నాయి. సగటు ఉద్యోగులతో పోలిస్తే.. ఫ్రెషర్లు ఉద్యోగాలు పొందలేకపోతున్నారని అమెరికా డేటా వెల్లడించింది. ఏఐ రాకముందు కూడా ఫ్రెషర్స్ ఈ పరిస్థితులనే ఎదుర్కొన్నారు. అయితే ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలను నేర్చుకున్నవారికి తప్పకుండా ఉద్యోగాలు లభించకుండా ఉండే అవకాశం లేదు. చాలా కంపెనీలు ఏఐలను ఎంట్రీ లెవెల్ ఉద్యోగులు చేసే పనుల్లో ఉపయోగిస్తున్నాయి. మొత్తం మీద అమెరికాలో ఉద్యోగులు లభించని ఫ్రెషర్స్ కేవలం నాలుగు శాతం మంది మాత్రమే ఉన్నారు. యూఎస్ఏలో మాత్రమే కాకుండా.. ఇతర దేశాల్లో కూడా ఫ్రెషర్స్ పరిస్థితి ఇలాగే ఉంది. పరిస్థితులను చూస్తుంటే.. నిరుద్యోగులు పెరగడానికి లేదా ఉద్యోగాలు లభించకపోవడానికి కేవలం ఏఐ మాత్రమే కారణం చెప్పడానికి ఆస్కారం లేదు. బ్రిటన్, జపాన్ వంటి దేశాల్లో ఏఐ ఉన్నప్పటికీ.. ఉద్యోగుల జీతాలు కూడా భారీగానే పెరుగుతున్నాయి. దీన్నిబట్టి చూస్తుంటే.. ఉద్యోగులను తొలగించాలనే ఉద్దేశ్యం దాదాపు కంపెనీలకు లేదు, అంతే కాకుండా వారికి మంచి జీతాలను ఇవ్వడానికి కూడా ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. దిగ్గజ కంపెనీలన్నీ.. ప్రతి ఆపరేషన్‌లోనూ ఏఐలను తీసుకొస్తామని చెబుతూనే ఉన్నాయి. అయితే ముఖ్యమైన పనులకు మాత్రం ఏఐలను ఉపయోగించడం లేదు. అమెరికాలో కేవలం 10 శాతం కంపెనీలు మాత్రమే ఏఐలను గూడ్స్ అండ్ సర్వీస్ కోసం విరివిగా వాడుతున్నారని తెలుస్తోంది. ఒకవేళ కంపెనీలు ఏఐలను తీసుకున్నప్పటికీ.. ఉద్యోగులను వదులుకోవడానికి మాత్రం సిద్ధంగా లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఏఐ మనిషిని రీప్లేస్ చేయదు, మనిషితో కలిసి పనిచేస్తుంది, పని వేగంగా జరగడానికి సహాయం చేస్తుంది. కాబట్టి ఏఐ వల్ల ఉద్యోగాలు భారీగా పోతాయనేది కేవలం ఓ అపోహ మాత్రమే. ప్రస్తుతానికి ఉద్యోగులు నిశ్చితంగా ఉండవచ్చు, అయితే.. మారుతున్న ప్రపంచంలో మనగలగాలి అంటే.. టెక్నాలజీలో ,ముందుండాలన్న విషయాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో మర్చిపోకూడదు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# అకాల వర్షాలు.. కొండెక్కిన ధరలు.. ఇలాగే ఉంటే..!

### గత పదిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

- అనేక ప్రాంతాల్లో నీటమునిగిన కూరగాయల తోటలు
- సరుకు కొరతతో మండుతున్న ధరలు
- 10–20శాతం పెరిగిన ఆకుకూరలు, కూరగాయల రేట్లు

**దాదర్:** గత వారం, పదిరోజులుగా రాష్టవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలవల్ల వివిధ రకాల పంటలతోపాటు కూరగాయల తోటలకు అపార నష్టం వాటిల్లింది. వర్షాలకు అనేక ప్రాంతాల్లో కూరగాయల తోటలు నీటమునిగాయి. కొన్ని చోట్ల ట్రక్కులు, టెంపోలలో రవాణాకు సిద్ధంగా ఉంచిన కూరగాయలు కుళ్లిపోవడంతో అక్కడే రోడ్లపై పారేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఫలితంగా న్యూ ముంబై వాషిలోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ), అలాగే థానేలోని హోల్‌సేల్ మార్కెట్లలో కూరగాయల లోడుతో వచ్చే వాహనాల సంఖ్య తగ్గిపోయింది. సరుకు కొరత ఏర్పడడంతో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. మొన్నటి వరకు స్థిరంగా ఉన్న కూరగాయల ధరలు ఇప్పుడు అకాల వర్షాల వల్ల చుక్కలను తాకుతున్నాయి. అసలే వర్షాలు, ఆపై కూరగాయల కొరత, ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

**18 ఏళ్ల తరువాత మళ్లీ...**

రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో గత వారం, పదిరోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు కొంత ముందుగానే ఆరంభమవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ 20 రోజుల ముందుగానే ఊహించని వర్షాలతో సామాన్య జనాలతో పాటు రైతులు కూడా ఆందోళనకు గురయ్యారు. గత 18 ఏళ్ల కిందట మే నెలలో భారీ వర్షాలు కురిశాయి. ఆ తరువాత మళ్లీ ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలు రికార్డు బ్రేక్ చేశాయని కొలాబా, శాంటాక్రుజ్ వాతావరణ శాఖలు తెలిపాయి.

**ఇలాగే ఉంటే...మరింత పైపైకి...**

కొద్ది నెలలుగా స్థిరంగా కూరగాయలు, ఉల్లి, బంగాళదుంపలు, టమాటాలు, ఆకు కూరల ధరలు కొద్ది నెలలుగా స్థిరంగా ఉంటుండటంతో కొద్దిగా ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు అకాల వర్షాలు, ధరల పెరుగుదలతో బెంబేలెత్తిపోతున్నారు. కొరత కారణంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల ధరలు ఇప్పటికే 10-20 శాతం పెరిగాయి. రాష్ట్రంలోని అనేక జిల్లాలో రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో సరుకులు కుళ్లీపోకే ముందే అక్కడే ఖాళీ చేస్తున్నారు. తక్కువ ధరకు విక్రయించి కనీసం పెట్టుబడి రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రేట్లు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు అంటున్నారు.

# గేట్ వేమాండ్వా లాంచీ సేవల నిలిపివేత.. జేజే ఆసుపత్రిలోకి నీరు

## ఏటా వర్షా కాలంలో సర్వీసుల నిలుపుదల

- ఈ ఏడాది ముందుగానే మొదలైన వర్షా లు .. పదిరోజులుగా ముంబైలో ఎడతెగని వానలు
- ముందుజాగ్రత్త చర్యగా సర్వీసులను నిలిపివేస్తున్నట్లు మారిటైం బోర్డు ప్రకటన
- కేఈఎం, జేజే ఆసుపత్రుల్లోకి వరదనీరు



గేట్ వే ఆఫ్ ఇండియా-మాండ్వాల మధ్య సోమవారం నుంచి లాంచి సేవలను నిలిపివేశారు. మారిటైం బోర్డు ఆదేశాల మేరకు లాంచి యజమానులు సేవలు నిలిపివేశారు. దీంతో నిత్యం ఈ మార్గంలో లాంచీలలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇకనుంచి ఎక్కువ చార్జీలు చెల్లించి రోడ్డు మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది. లాంచీ సేవలు మళ్లీ సెప్టెంబరు 26వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని లాంచీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్దార్ మహాడ్కర్ తెలిపారు. ముంబై పరిసరా ప్రాంతాల్లో గత వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు పక్షం రోజుల ముందే వర్షాలు ప్రారంభం కావడంతో ముందు జాగ్రత్త చర్యగా ఈ నెల 26వ తేదీ నుంచి లాంచి సేవలు నిలిపివేయాలని మారిటైం బోర్డు నిర్ణయించింది. ఏటా వర్షా కాలంలో జూన్ ఒకటో తేదీ నుంచి లాంచీ సేవలు నిలిపివేస్తారు. కానీ ఈసారి వర్షాలు తొందరగా ప్రారంభం కావడంతో వారం రోజుల సర్వీసులను నిలిపివేశారు.

**రోరో సేవల కొనసాగింపు...**

ముంబైకి సమీపంలో ఉన్న వివిధ ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో అలీబాగ్ ఒకటి. ఇక్కడికి వెళ్లేందుకు రోడ్డు మార్గం ఉన్నప్పటికీ 90 శాతం పర్యాటకులు లాంచీలను ఆశ్రయిస్తారు. రోడ్డు మార్గం కంటే సముద్ర మార్గం ద్వారా అలీబాగ్‌కు చేరుకోవడం చాలా సులభం. బస్సు చార్జీలతో పోలిస్తే లాంచీ చార్జీలు చాలా తక్కువ. గేట్ వే ఆఫ్ ఇండియా-మాండ్వా మధ్య ప్రతీ రోజు 40-50 లాంచీలు నడుపుతారు. వర్షాకాలంలో సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. ముఖ్యంగా హై టైడ్ కారణంగా లాంచీలకు ప్రమాదం పొంచి ఉంటుంది. అయితే ఈసారి ముందుగానే వర్షాలు మొదలుకావడంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకముందే లాంచీ సర్వీసులను నిలిపివేయాలని బోర్డు నిర్ణయం తీసుకుంది. అయితే భావుచా ధక్క-మాండ్వా మధ్య రోల్ ఆన్-రోల్ ఆఫ్ (రోరో) సేవలు కొనసాగుతాయని మారిటైం బోర్డు తెలిపింది.

**ఉపాధి..ఆదాయానికి గండి....**

గేట్ వే-మాండ్వా మధ్య పీఎన్‌పీ, మాల్దార్, అజంత, అపోలే కంపెనీల లాంచీలు సేవలందిస్తున్నాయి. దాదాపు మూడు నెలలకుపైగా లాంచి సేవలు నిలిచిపోనుండటంతో వీటి యజమానులు, అక్కడి హోటళ్లు, లాడ్జింగులు, వాహనాల యజమానుల ఆదాయానికి గండిపడనుంది. ముంబై నుంచి బయలుదేరే పర్యాటకులతోపాటు అలీబాగ్ నుంచి ముంబైకి వచ్చే వ్యాపారులు, ఉద్యోగుల రాకపోకలు కూడా నిలిచిపోతాయి. ఇకనుంచి వీరంతా రోడ్డు మార్గాన్ని ఆశ్రయించాల్సి వస్తుంది. ఇది వ్యయ, ప్రయాసలతో కూడున్నదైనప్పటికీ తప్పదని అధికారులు అంటున్నారు.

### కేఈఎం, జేజే ఆసుపత్రుల్లోకి వరదనీరు

ముంబైలో కురుస్తున్న భారీ వర్షా లు నగర జీవనాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేసింది. వర్షా ల కారణంగా కేఈఎం, జె.జె. ఆసుపత్రులు నీట మునిగాయి. పరేల్‌లోని కేఈఎం ఆసుపత్రి ప్రధాన ప్రవేశ ద్వారం , పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) వద్ద అలాగే కొన్ని రోగుల గదుల వెలుపల భా రీగా నీరు నిలిచిపోయింది. టాటా ఆసుపత్రి, కేఈఎం ఆసుపత్రి, వార్డు 4ఏ వరండాల్లో నీరు చేరింది. నీటి పంపులతో వెంటనే నీటిని తొల గించినట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్ జోషి తెలిపారు. ఇక జె.జె. ఆసుపత్రిలో కూడా పరిస్థితి భయానకంగా ఉంది. ప్రధాన భవనం వెలుపల, అలాగే ఆసుపత్రి నివాస భవనాల పరిసరాలు మోకాలి లోతు నీటిలో మునిగిపోయింది. ఎంఆర్ఐ, సిటీ స్కాన్ కోసం వచ్చిన రోగులు నీటిలోనే నిలబడాల్సి వచ్చింది. అవుట్ పేషెంట్ భవనం నుంచి ప్రధాన భవనానికి వెళ్లే రోగులు పూర్తిగా నీటిలోనే నడవాల్సి వచ్చింది. జె.జె. ఆసుపత్రి సమీపంలోని పోలీస్ స్టేషన్ ప్రాంతం, ప్రజా పనుల విభాగం ఆవరణలోనూ నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అ యితే గత సంవత్సరం లాగా ఆసుపత్రి భవనం ఈసారి పూర్తిగా నీటమునగలేదని, తగిన ముందు జాగ్రత్తలు తీసుకున్నామని జె.జె. ఆసుపత్రి డీన్ డాక్టర్ అజయ్ భండార్వర్ తెలిపారు.

## కాళీగంజ్ ఉపఎన్నిక.. అభ్యర్థిని ప్రకటించిన టీఎంసీ




**నదియా:** పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలో జూన్ 19న జరగనున్న కాళీగంజ్ అసెంబ్లీ ఉప ఎన్నికకు తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) తమ అభ్యర్థిగా అలీఫా అహ్మద్‌ను ప్రకటించింది. అలీఫా అహ్మద్ దివంగత తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ కుమార్తె. ఈ విషయాన్ని ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారం 'ఎక్స్'లో తెలిపింది. 'పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ మార్గదర్శకత్వంలో పశ్చిమ బెంగాల్ శాసనసభ ఉప ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించడానికి మేము సంతోషిస్తున్నాం. కాళీగంజ్ అభ్యర్థి అలీఫా అహ్మద్' అని టీఎంసీ తెలిపింది. సిట్టింగ్ అసెంబ్లీ సభ్యుడు నసీరుద్దీన్ అహ్మద్ మృతితో కాళీగంజ్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. 'లాల్ దా'గా పేరొందిన అహ్మద్ తన 70వ ఏట కన్నుమూశారు. ఆయన కాళీగంజ్ నియోజకవర్గానికి పలుమార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈ సీటుకు ఎంతో రాజకీయ ప్రాముఖ్యత ఉంది. ఇటీవల జరిగిన ఓటర్ల జాబితా సవరణ తర్వాత, కాళీగంజ్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2.5 లక్షల మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలోని కాళీగంజ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జూన్ 19న ఉప ఎన్నిక జరగనున్నదని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఆదే రోజున ఉప ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో కాళీగంజ్ ఒకటి. ఈసీ తెలిపిన వివరాల ప్రకారం ఉప ఎన్నికల ఫలితాలు జూన్ 23న ప్రకటించనున్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ జూన్ 2. జూన్ 3న వీటి పరిశీలన జరగనుంది. అభ్యర్థులు జూన్ 5 వరకు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు ఇచ్చారు.

### ఇద్దరు ఎమ్మెల్యేలకు బీజేపీ హైకమాండ్ షాక్..

## పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరణ



**బెంగళూరు:** సొంత పార్టీ ఎమ్మెల్యేలకు బీజేపీ హైకమాండ్ షాకిచ్చింది. పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు, కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర మంగళవారం పార్టీ ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, ఏ శివరామ్ హెబ్బర్‌లపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. కర్ణాటకలో ఎస్టీ సోమశేఖర్ యశ్వంత్‌పూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఎ శివరామ్ హెబ్బార్ యల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా సేవలందిస్తున్నారు. అయితే, ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు సుదీర్ఘ కాలంగా పార్టీ క్రమశిక్షణను పదేపదే ఉల్లంఘిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ కేంద్ర క్రమశిక్షణ కమిటీ సభ్య కార్యదర్శి ఓం పాఠక్ హెబ్బార్ ఓ లేఖను విడుదల చేశారు. ఆ లేఖలో పార్టీ క్రమశిక్షణను పదేపదే ఉల్లంఘిస్తున్న కారణంగా ఎమ్మెల్యేలను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. పార్టీ హైకమాండ్ నిర్ణయంతో ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నట్లు బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర లేఖను విడుదల చేశారు. ఆ లేఖలో పార్టీ కేంద్ర క్రమశిక్షణా కమిటీ 2025 మార్చి 25 నాటి షోకాజ్ నోటీసుకు మీ ప్రతి స్పందనను పరిగణనలోకి తీసుకుంది. మీరు పార్టీ క్రమశిక్షణను పదే పదే ఉల్లంఘించడాన్ని తీవ్రంగా పరిగణించింది. అందుకు మిమ్మల్ని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి తక్షణమే ఆరేళ్ల పాటు బహిష్కరించాలని నిర్ణయించింది' అని అందులో పేర్కొన్నారు.



# రెండోమారు తెలంగాణ ఆడపడుచుగా?

'మహానటి' సావిత్రిగా శిఖర సమానమైన అభినయాన్ని ప్రదర్శించిన కీర్తిసురేష్.. 'సర్కారువారి పాట'లో కళావతిగా యువతరం కంటికి కునుకు లేకుండా చేశారు. నటిగా ఈ పొంతన లేని కోణాలు ఆమెను నిజంగానే మహానటిని చేశాయి. ప్రస్తుతం అటు సినిమాలు, ఇటు వెబ్ సిరీస్‌లు అంటూ క్షణం తీరిక లేకుండా కెరీర్ సాగిస్తున్నారు కీర్తి సురేశ్. చెన్నయ్ టూ ముంబై వయా హైదరాబాద్.. ఇది ప్రస్తుతం కీర్తి సురేశ్ పరిస్థితి. 'అక్క' అనే వెబ్ సిరీస్‌తో పాటు, తమిళంలో 'రివాల్వర్ రీటా' అనే సినిమా కూడా చేస్తున్నారు.

ఇక తెలుగులో 'బలగం'ఫేం వేణు యల్దెండి దర్శకత్వంలో రూపొందనున్న 'ఎల్లమ్మ'లో టైటిల్ రోల్ కీర్తి సురేషే అని ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్త బలంగా వినిపిస్తున్నది. ఇప్పటికే 'దసరా' సినిమాలో తెలంగాణ మహిళగా అద్భుతంగా నటించారు కీర్తి. ఇప్పుడు 'ఎల్లమ్మ'గా ఆమె ఖరారైన మాట నిజమైతే.. రెండోసారి తెలంగాణ పడుచుగా కనిపిస్తారన్నమాట. వేణు యల్దెండి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం తెలంగాణ సంస్కృతి, నమ్మకాల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తున్నది. వచ్చే నెలలోనే ఈ సినిమా షూటింగ్ మొదలుకానున్నదట.

# బాలీవుడ్ హీరో ఇంట్లోకి ప్రవేశించిన మహిళ.. చివరికి ఏమైందంటే?



బాలీవుడ్ నటుడు ఆదిత్య రాయ్ కపూర్ ఇంట్లో గుర్తు తెలియని మహిళ ప్రవేశించింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హీరో ఇంటికి వచ్చిన ఆమె పనిమనిషితో ఆదిత్య రాయ్ కపూర్‌ను కలిసేందుకు వచ్చానని తెలిపింది. ఆయన కోసం బహుమతులు కూడా తీసుకొచ్చానని చెప్పింది. దీంతో ఆమెను ఇంట్లోకి అనుమతించారు. కానీ ఆ సమయంలో ఆదిత్య రాయ్ కపూర్ ఇంట్లో లేరని సమాచారం. ఆదిత్య రాయ్ కపూర్ ఇంట్లో లేనప్పుడు ఆయన ఇంట్లోకి మహిళ వచ్చిన విషయాన్ని ఆ తర్వాత హీరోకు సిబ్బంది తెలియజేశారు. దీంతో ఆదిత్య రాయ్ కపూర్ వెంటనే హౌసింగ్ సొసైటీ అధికారులను సంప్రదించగా.. వారు ఖర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు 47 ఏళ్ల గజాలా సిద్ధిక్ అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై కేసు కూడా నమోదు చేశారు. అయితే ఈ కేసు దర్యాప్తులో ఇది సిద్ధిక్‌కు ఇలా చేయడం మొదటి సారి కాదని తెలిసింది. గత వారంలో ఆమె సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించిందని పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమెను బాంద్రా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దుబాయ్ నివాసిగా చెప్పుకునే గజాలా సిద్ధిక్.. ఆదిత్య రాయ్ కపూర్‌ను కలవడానికి ముంబైకి వచ్చానని పోలీసులతో చెప్పారు. దీంతో కేసు నమోదు చేసిన బాలీవుడ్ ప్రముఖులను సంప్రదించడానికి ఆమె పదే పదే ప్రయత్నించిన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ముందు అక్కడ.. ఇప్పుడు మన దగ్గర స్ట్రీమింగ్



గత నెలలో థియేటర్లలో రిలీజైన ఓ తెలుగు సినిమా.. ఎలాంటి హడావుడి లేకుండా ఓటీటీలోకి వచ్చేసింది. రిలీజైన మూడు వారాలకే ఓవర్సీస్ ఓటీటీలోకి వచ్చిన ఈ చిత్రం.. ఇప్పుడు తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. బ్యాంక్ రాబరీ థ్రిల్లర్ స్టోరీతో తీసిన ఈ మూవీ సంగతేంటి? ఎందులో స్ట్రీమింగ్ అవుతుందనేది ఇప్పుడు చూద్దాం. డైరెక్టర్ నక్కిన త్రినాథరావు నిర్మించిన సినిమా 'చౌర్యపాఠం'. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ హీరోహీరోయిన్లుగా నటించారు. ఓ సినిమా డైరెక్టర్.. బ్యాంక్ దొంగతనానికి ప్రయత్నిస్తే ఏమైందనే కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రం.. ఏప్రిల్ 24న థియేటర్లలోకి వచ్చింది. కానీ వచ్చినంత వేగంగానే మాయమైపోయింది. ఇప్పుడు ఈ మూవీ అమెజాన్ ప్రైమ్‌లోకి వచ్చేసింది. చౌర్యపాఠం విషయానికొస్తే.. వేదాంత్ రామ్(ఇంద్రరామ్)కి దర్శకుడు కావాలనేది కల. నిర్మాతలు ఎవరూ ముందుకు రాకపోయేసరికి బ్యాంక్ దొంగతనం చేసి ఆ డబ్బులతో సినిమా తీయాలని ఫిక్స్ అవుతాడు. బబ్లూ, జాక్ డాన్ అనే ఇద్దరిని తన ప్లాన్ లో భాగం చేస్తాడు. అదే బ్యాంకులో పనిచేస్తున్న అంజలి(పాయల్ రాధాకృష్ణ) వీళ్లకు తోడవుతుంది. తర్వాత ఏం జరిగిందనేదే మిగతా స్టోరీ. ఇకపోతే ఈ వారం దాదాపు 15కి పైగా కొత్త సినిమాలు, వెబ్ సిరీసులు స్ట్రీమింగ్ కాబోతున్నాయి. వీటిలో హిట్ 3, రెట్రో, తుడరమ్ లాంటి స్ట్రెయిట్ డబ్బింగ్ చిత్రాలతో పాటు 'అజ్ఞాతవాసి' అనే కన్నడ థ్రిల్లర్ మూవీ చాలా ఆసక్తి కలిగిస్తున్నాయి. మూవీ లవర్స్‌కి అయితే ఈ వీకెండ్ పండగే పండగ అని చెప్పొచ్చు. ఇప్పుడు ఈ లిస్టులోకే 'చౌర్యపాఠం' కూడా వచ్చి చేరింది.



# జైలర్2లో విలన్‌గా తెలుగు అగ్ర హీరో

టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున తొలిసారి విలన్‌గా నటించనున్నారని వార్తలు వస్తున్నాయి. రజనీకాంత్ నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న జైలర్2లో ఆయన విలన్‌గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు కోలీవుడ్‌లో వార్తలు వైరల్ అవుతున్నాయి. జైలర్ పార్ట్1లో విలన్‌గా వినాయకన్ నటించిన విషయం తెలిసిందే. అయితే, సిక్వెల్‌లో ఆయన పాత్ర కేవలం రెండుమూడు సీన్ల వరకే ఉంటుందని టాక్. జైలర్2 షూటింగ్‌లో వినాయకన్ రెండురోజులు మాత్రమే పాల్గొనడంతో ఆయన పాత్రపై ఒక క్లారిటీ వచ్చేసింది. అయితే, ఫుల్ లెన్త్ విలన్‌గా నాగార్జున నటించనున్నారని కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే రజనీకాంత్ 'కూలీ'లో నాగార్జున ఒక కీలకమైన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే.. ఈ సినిమాలో, నాగార్జున సిమాన్ అనే పాత్రను పోషిస్తున్నారు. అయితే, ఇందులో కూడా ఆయన పాత్ర నెగటివ్ షేడ్‌లోనే ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రాన్ని లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో క్రేజీ నటి శృతిహాసన్ ముఖ్యపాత్రను పోషించగా, బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్, టాలీవుడ్ యువ సామ్రాట్ నాగార్జున, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఇలా పలువురు ప్రధాన పాత్రలు పోషించారు. కూలీ చిత్రాన్ని ఆగస్టు 14వ తేదీన విడుదల చేయనున్నట్లు చిత్ర వర్గాలు ఇప్పటికే ప్రకటించాయి. జైలర్2 షూటింగ్ రీసెంట్‌గా చెన్నై పరిసర ప్రాంతాల్లో కొంత భాగం జరిగింది. ప్రస్తుతం కేరళలో జరుపుకుంటుంది. అక్కడ షూటింగ్‌లో నాగార్జున పాల్గొన్నట్లు సమాచారం.

## క్రీడా వార్తలు | SPORTS NEWS



# తొలి స్వర్ణం భారత్‌కే..

## కాంస్యంతో మెరిసిన రేస్ వాకర్..!

ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ బోణీ కొట్టింది. దక్షిణా కొరియాలోని గుమీ వేదికగా జరుగుతున్నఈ టోర్నమెంట్ తొలి రోజే అథ్లెటిక్స్‌లో గుల్వీర్ సింగ్ స్వర్ణ పతకంతో మెరిశాడు. పురుషుల 10 వేల పరుగులో అగ్రస్థానంలో నిలిచిన గుల్వీర్ పసిడితో దేశం గర్వపడేలా చేశాడు. దాంతో, ఈ పోటీల్లో తొలి గోల్డ్ మెడల్ సాధించిన దేశంగా భారత్ నిలవగా.. స్వర్ణం గెలుపొందిన మూడో భారతీయుడిగా రికార్డు నెలకొల్పాడీ అథ్లెట్. ఇక 29 కిలోమీటర్ల రేస్ వాక్‌లో భారత అథ్లెట్ సెర్విన్ సెబాస్టియన్ (Servin Sebastian) కాంస్యంతో గర్జించాడు. నాలుగో స్థానంలో నిలిచిన సవాన్ బర్వాల్ కొద్దిలో పతకం చేజార్చుకున్నాడు. అయితే.. మహిళా అథ్లెట్లు మాత్రం విఫలమయ్యారు. ఆసియా క్రీడల్లో పసిడి పతకం గెలుపొందిన జావెలిన్ త్రోయర్ అన్ను రాణి (Annu Rani) నాలుగో స్థానంతో నిరాశపరిచింది.

### మూడో భారతీయుడిగా...

మంగళవారం ఆసియా ఛాంపియన్‌షిప్స్ ఆరంభం కాగా.. రేస్ వాకర్ సెర్విన్ సెబాస్టియన్ తొలి పతకం అందించాడు. గంట 21 నిమిషాల 13.60 సెకన్ల వ్యవధిలో లక్ష్యాన్ని చేరకున్న సెర్విన్ కంచు మోత మోగించాడు. అనంతరం జరిగిన 10 వేల మారథాన్‌లో గుల్వీర్ సింగ్ అలుపెరగకుండా పరుగెత్తి గోల్డ్ మెడల్ కొల్లగొట్టాడు. ఈ ఏడాది ఆరంభంలో జాతీయ రికార్డు బద్ధలు కొట్టిన ఈ రన్నర్.. ఉత్కంఠ రేపిన ఫైనల్లో ప్రత్యర్థులకు షాకిచ్చాడు. తద్వారా ఈ టోర్నీ..10 వేల పరుగులో స్వర్ణం సాధించిన మూడో భారతీయుడిగా గుల్వీర్ రికార్డు సృష్టించాడు. అతడి కంటే ముందు హరి చంద్(1975), జీ. లక్ష్మణన్(2017)లు ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పసిడితో పోడియం మీద భారత పతాకాన్ని రెపరెపలాడించారు.


# వీరోచితమైన ఇన్నింగ్స్ ఆడిన జితేశ్

## ఉత్కంఠ పోరులో లక్నోపై ఆర్సీబీ ఘన విజయం

ఐపీఎల్ 2025లో భాగంగా ఇవాళ (మే 27) జరిగిన ఉత్కంఠ పోరులో లక్నోపై ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో భారీ స్కోర్ (227/3) చేసింది. రిషబ్ పంత్ (61 బంతుల్లో 118 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్సర్లు) విధ్వంసకర శతకంతో విరుచుకుపడ్డాడు. మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 67; 4 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపు అర్ధ సెంచరీతో అలరించాడు. లక్నో ఇన్నింగ్స్‌లో మాథ్యూ బ్రీట్జ్కీ 14, పూరన్ 13 పరుగులు చేసి ఔటయ్యారు. ఆర్సీబీ బౌలర్లలో తుషార, భువనేశ్వర్ కుమార్, షెపర్డ్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీ విజయవంతమైంది. ఆ జట్టు 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జితేశ్ శర్మ (33 బంతుల్లో 85 నాటౌట్; 8 ఫోర్లు, 6 సిక్సర్లు) వీరోచితమైన ఇన్నింగ్స్ ఆడి ఆర్సీబీని గెలిపించాడు. అతనికి మయాంక్ అగర్వాల్ (23 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు) సహకరించాడు. అంతకుముందు విరాట్ కోహ్లి (30 బంతుల్లో 54; 10 ఫోర్లు), ఫిల్ సాల్ట్ (19 బంతుల్లో 30; 6 ఫోర్లు) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి ఆర్సీబీ గెలుపుకు పునాది వేశారు. లక్నో బౌలర్లలో విలియమ్ ఓరూర్కీ 2, ఆకాశ్ సింగ్, ఆవేశ్ ఖాన్ తలో వికెట్ తీశారు. ఈ గెలుపుతో ఆర్సీబీ టేబుల్ సెకెండ్ టాపర్‌గా నిలిచి ప్లే ఆఫ్స్‌కు చేరింది. మే 29న జరిగే క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ.. పంజాబ్‌తో తలపడనుంది. మే 30న జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్, ముంబై ఇండియన్స్ అమీతుమీ తేల్చుకుంటాయి.



### విధ్వంసకర శతకం.. పల్టీ కొట్టిన పంత్



ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో పేలవ ప్రదర్శన కారణంగా ముప్పేట దాడిని ఎదుర్కొన్న పంత్ ఎట్టకేలకు తమ చివరి మ్యాచ్‌లో ఫామ్‌లోకి వచ్చాడు. ఆర్సీబీతో ఇవాళ (మే 27) జరుగుతున్న మ్యాచ్‌లో పంత్ విధ్వంసకర శతకంతో (61 బంతుల్లో 118 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్సర్లు) విరుచుకుపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ఆది నుంచే దూకుడుగా ఆడిన పంత్.. 54 బంతుల్లో సెంచరీని పూర్తి చేశాడు. ఐపీఎల్‌లో పంత్‌కు ఇది రెండో సెంచరీ. సెంచరీ పూర్తి చేసిన అనంతరం పంత్ ఆనందంతో పల్టీ కొట్టాడు. దీనికి సంబంధించిన క్లిప్పింగ్స్, వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# సాత్విక్-చిరాగ్ జోడీ రీఎంట్రీ

## నేటి నుంచే సింగపూర్ ఓపెన్

**సింగపూర్ :** మూడు నెలల స్వల్ప విరామం తర్వాత భారత డబుల్స్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్ సాయి రాజ్ చిరాగ్ శెట్టి ఆటకు పునరాగమనం చేయనున్నారు. మంగళవారం నుంచి మొదలుకాబోయే బీడబ్ల్యూఎఫ్ సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో ఈ ప్రపంచ మాజీ నెంబర్ వన్ జోడీ బరిలోకి దిగనున్నారు. ఈ ఏడాది మార్చిలో ఆల్ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్ ఆడిన సాత్విక్‌చిరాగ్ జంట.. ఆ తర్వాత పలు కారణాలతో కీలక టోర్నీలకు దూరంగా ఉంది. తొలి రౌండ్‌లో ఈ భారత జోడీ.. మలేషియా ద్వయం చూంగ్ హోన్‌మహ్మద్ హైకల్‌తో తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జి పోటీలో ఉన్నారు. ఇక మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు భారత బృందాన్ని నడిపించనుంది. సింధుతో పాటు అన్మోల్ ఖర్బ్, మాళవిక బన్సోద్, అనుపమ ఉపాధ్యాయ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సింగిల్స్ విభాగాల్లో భారత షట్లర్లు గత కొన్నాళ్లుగా ఆశించిన స్థాయిలో రాణించలేక చతికిలపడుతుండగా సింగపూర్ ఓపెన్‌లో వాళ్లకు కఠిన సవాల్ ఎదురుకానుంది. గత వారం మలేషియా మాస్టర్స్‌లో ఫైనల్ చేరిన కిడాంబి శ్రీకాంత్.. ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు. మహిళల డబుల్స్‌లో భారత స్టార్ పెయిర్ త్రిసా జాలీగాయత్రి గోపీచంద్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల బరిలో ఉన్నారు.

# ఐపీఎల్ ఫైనల్‌కు త్రివిధ దళాధిపతులను ఆహ్వానించిన బీసీసీఐ




**ముంబై :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ జూన్ 3వ తేదీన అహ్మదాబాద్‌లో జరగనున్నది. అయితే ఆ ఫైనల్ కు త్రివిధ దళాలకు చెందిన అధిపతులను ఆహ్వానించినట్లు బీసీసీఐ ఇవాళ చెప్పింది. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతీయ రక్షణ దళాలు ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలను ఆపరేషన్ సింధూర్‌తో ధ్వంసం చేశారు. వాస్తవానికి ఆ ఆపరేషన్ చేపట్టి సమయంలో ఐపీఎల్ మ్యాచ్‌లను కూడా రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇక ఐపీఎల్‌లో ప్లే ఆఫ్స్ దశ ప్రారంభంకానున్నది. ఇవాళ తుది లీగ్ మ్యాచ్ జరగనున్నది. గురువారం క్వాలిఫైయర్ 1 మ్యాచ్ జరగనున్నది. ఆపరేషన్ సింధూర్‌లో ధైర్యసాహసాలను ప్రదర్శించిన సైనికులకు నివాళి అర్పించేందుకు బీసీసీఐ ప్లాన్ వేసింది. దీనిలో భాగంగా ఐపీఎల్ ఫైనల్‌కు త్రివిధ దళాధిపతులను ఆహ్వానించింది. ఆర్మీ, నేవీ, ఎయిర్ డిఫెన్స్‌కు చెందిన టాప్ ఆఫీసర్లను, సైనికులను కూడా ఫైనల్‌కు ఆహ్వానించారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్‌ను సెలబ్రేట్ చేసుకోనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. సైనిక దళాల ధైర్యం, తెగువ, నిస్వార్ధ సేవ పట్ల బీసీసీఐ సెల్యూట్ చేస్తుందని సైకియా పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో చూపిన సైనికుల తెగువను ఆయన ప్రశంసించారు. సైనికులు తమ సత్తాతో దేశాన్ని రక్షించినట్లు చెప్పారు. యావత్ దేశ ప్రజలకు ప్రేరణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మన సైనిక దళాలను, హీరోలను గౌరవించాలన్న ఉద్దేశంతో.. ముగింపు వేడుకలను వారికి అంకితం ఇచ్చేందుకు నిర్ణయించామని ఆయన చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com